PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 127 | విజయవాడ, మంగళవారం 9 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 9 December 2025 | Rs



ఓపెనర్లుగా గిల్, అభిషేక్

- హార్దిక్ పాండ్యా పునరాగమనం
- నేడు దక్షిణాఫ్రికాతో తొలి టి20

8



న్యాయం కోసం.. ఉక్కు నిర్వాసితుల భారీ ఆందోళన

- స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ వద్ద ఉద్రిక్తత

2

ఎపి బ్రాండ్ పునరుద్ధరించాం

జిఎస్‌డిపి వృద్ధి 11.28% • మీడియాతో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి బ్రాండ్ పునరుద్ధరించామని తద్వారా క్రమంగా పెట్టుబడులు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి అభివృద్ధి (జిఎస్‌డిపి) 11.28 శాతంగా నమోదైందని, ఇది దేశ జిడిపి (8.7 శాతం) కంటే ఎక్కువని చెప్పారు. ఈ ఆర్థిక గణాంకాలను సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రంలో నీటిభద్రత, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వ్యయం తగ్గింపు, ప్రొడక్టు పర్ఫెక్షన్, డీప్ టెక్ వంటి 10 సూత్రాలను సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. తద్వారా గతంతో పోలిస్తే మెరుగైన వృద్ధిరేటు గణాంకాలు నమోదవుతున్నాయని చెప్పారు. గతేడాది 2వ త్రైమాసికంలో జిఎస్‌డిపి 10.17 శాతంగా ఉందని, దీని విలువ రూ.3,59,778 కోట్లు అని తెలిపారు. ఈ త్రైమాసికంలో గతం కంటే 1.11 శాతం పెరిగిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధి 10.70 శాతం, పరిశ్రమల రంగం 12.20 శాతం, సేవల రంగం 11.30 శాతం, గ్రాస్ వాల్యూ యాడెడ్ వృద్ధి నమోదైందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 17.11 శాతం జిఎస్‌డిపి వృద్ధి లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలన అందించే విధంగా పనిచేస్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు విధ్వంసం చేసిన వ్యవస్థలను గాడిలో పెట్టి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని వెల్లడించారు. ప్రతి త్రైమాసికం, ఆర్థిక సంవత్సరంలో సాధిస్తున్న రాష్ట్ర స్థూల ఉత్పత్తిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. మూలధన వ్యయం చేయకపోవటంతో గతంలో ఎక్కడా ప్రాజెక్టులు ముందుకు వెళ్లలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని ముందుకు తీసుకెళ్లగలిగామన్నారు. వారసత్వంగా అప్పులతో పాటు 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఇచ్చి వెళ్లారని చెప్పారు. జనవరి ఒకటి నాటికి ఎక్కడా చెత్త లేకుండా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

వరి సాగు తగ్గించాలి

రైతులు వరి పంటను తగ్గించి ఇతర పంటలు సాగుచేసే విధంగా ఆలోచన చేయాలని చంద్రబాబు చెప్పారు. అంతా వరి పండిస్తే రాబోయే రోజుల్లో దానిని కొనేవాళ్లు ఉండరని తెలిపారు. తాను రైస్ తినడం లేదని చెప్పారు. రైస్ తింటే మిగతా 5లో

పెంచలయ్య కుటుంబానికి సాయం చేస్తాం

నెల్లూరు జిల్లాలో గంజాయి మూకల చేతుల్లో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబానికి సాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. పెంచలయ్య హత్యకు నిరసనగా అన్ని రాజకీయ పార్టీలు బంద్ నిర్వహించాయని, కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందిస్తారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు పరిశీలించి సాయం చేస్తామని చంద్రబాబు చెప్పారు. నెల్లూరు జిల్లాలో లేడీ డాన్లు పెరిగారని, గంజాయి అమ్మించడంతో పాటు హత్యలు చేయిస్తున్నారని అన్నారు.

ఫిబ్రవరిలో అఖిల భారత సమ్మె

- కేంద్ర కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరిలో అఖిల భారత సార్వత్రిక సమ్మె చేపట్టనున్నట్లు కేంద్ర కార్మిక సంఘాలు వెల్లడించాయి. కార్మికవర్గంపై యుద్ధానికి వర్గ యుద్ధంతో సమాధానం చెబుతామని కేంద్ర కార్మిక సంఘాల నేతలు స్పష్టం చేశారు. సోమవారం నాడిక్కడ కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సమావేశమయ్యారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు దశలవారీ పోరాటాలు కొనసాగించాలని నిర్ణయించారు. కార్యాలయ స్థాయిలో సామూహిక ప్రచారం, నిరసనలను కొనసాగిస్తూ, కేంద్ర కార్మిక సంఘాలు, రంగాల సమాఖ్యల ఉమ్మడి వేదిక ఫిబ్రవరిలో అఖిల భారత సార్వత్రిక సమ్మెకు దిగనుంది. తదుపరి సమావేశంలో డిసెంబరు 22న తేదీలను ప్రకటిస్తామని సంఘాల నేతలు తెలిపారు. ఈ సమావేశంలో తపన్ సేన్, హేమలత, ఎఆర్ సింధు, కెఎన్ ఉమేష్, సుదీప్ దత్తా (సిఐటియు), అమర్‌జీత్ కౌర్ (ఎఐటియుసి), అశోక్ సింగ్ (ఐఎన్‌టియుసి), హర్భజన్ సింగ్ సిద్ధూ (హెచ్‌ఎంఎస్), ఆర్‌కె పరాశర్, చౌరాసియా (ఎఐయుటియుసి), రాజీవ్ దిమ్రి (ఎఐసిసిటియు), సోనియా జార్జ్ (సెవా), వీస్వామి (ఎల్‌పిఎఫ్), శత్రుజీత్ (యుటియుసి) తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై భగ్గుమన్న పంగులూరు మహిళలు

- అక్రమంగా దాచిన మద్యం సీసాలను వీధిలోకి తీసుకొచ్చి దహనం
- ఇకపై మద్యం అమ్మితే 'ఖబడ్దార్' అంటూ హెచ్చరిక

2



వందేమాతరం 150వ వార్షికోత్సవ చర్చలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ, ప్రియాంక గాంధీ

వందేమాతరం స్ఫూర్తితో 2047 వికసిత్ భారత్

నెహ్రూ, కాంగ్రెస్‌లే లక్ష్యంగా ప్రధాని ప్రసంగం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వందేమాతరం స్ఫూర్తితో 2047 వికసిత్ భారత్ కోసం కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన వందేమాతరం గీతానికి పునర్వైభవం రావాలని, ఇప్పుడు జరిగే చర్చలు భవిష్యత్ తరానికి స్ఫూర్తి కావాలని చెప్పారు. వందేమాతర గేయాన్ని కాంగ్రెస్ ముక్కలు ముక్కలుగా చేసిందంటూ ఆ గేయంపై 150వ వార్షికోత్సవ చర్చను మాజీ ప్రధాని నెహ్రూ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలకు వేదికగా మోడీ చేసుకున్నారు. ఆ గేయంపై లోక్‌సభలో సోమవారం జరిగిన చర్చను మోడీ ప్రారంభిస్తూ... నెహ్రూపై విమర్శలు గుప్పించారు. దాంతో వందేమాతరం గేయంపై చర్చ అదుపు తప్పి రాజకీయ విమర్శలకు వేదిక అయింది. ముస్లింలను రెచ్చగొడుతుందన్న ఉద్దేశంతోనే ఆ గేయాన్ని కాంగ్రెస్ ముక్కలు ముక్కలు చేసిందని మోడీ అన్నారు. లోక్‌సభలో ప్రధాని మోడీ ఆ వ్యాఖ్యలు చేసిన వెంటనే అధికార పార్టీ సభ్యులు సిగ్గు సిగ్గు అంటూ అరిచారు. ఎమర్జెన్సీ పాలన సమయంలో వందేమాతరం గీతానికి వందేళ్లు పూర్తయ్యాయని, కానీ ఆ సమయంలో రాజ్యాంగం తీవ్రంగా అణచివేతకు గురైందని అన్నారు. బెంగాలీ రచయిత బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో వందేమాతరం గీతాన్ని రాశారు. వందేమాతర మంత్రం స్వాతంత్ర్య సమరోత్సాహ సమయంలో యావత్ దేశ ప్రజలకు శక్తిని, ప్రేరణను ఇచ్చిందన్నారు. వందేమాతరానికి 50 ఏళ్లు నిండిన సమయంలో దేశం ఇంకా బ్రిటీషు పాలనలో ఉందని, ఇక వందేళ్లు పూర్తయిన సమయంలో దేశంలో ఎమర్జెన్సీ ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఇప్పుడు వందేమాతరం గొప్పతనాన్ని పునరుద్ధరించేందుకు మనకు అవకాశం వుందన్నారు. ఈ చర్చలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జైహింద్ కంటే తక్కువ కాదు

- వందేమాతరంపై చర్చలో సిపిఎం ఎంపి ఎస్. వెంకటేశన్ ప్రసంగం

7

కబుర్లు ఎక్కువ... కార్యాచరణ తక్కువ

- రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం ప్రచారంపై బివి రాఘవులు
- 'ఉక్కు' ప్రతిష్టను దిగజార్చి వదిలించుకునే కుట్రలు సాగనివ్వం
- పాలకవర్గ విధానాల ఫలితమే విమానయాన సంక్షోభం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా ముందుకెళ్లిపోతోందని లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు వస్తున్నాయని చంద్రబాబు ప్రభుత్వం కబుర్లు ఎక్కువగా చెప్పి, అందుకు తగ్గట్టు కార్యాచరణ లేకుండా వ్యవహరిస్తోందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. ఆ కబుర్లు ఈనాటివి కావని, సిఐఐ సమ్మిట్లతో రూ.లక్షల కోట్లు వచ్చి పడిపోతున్నాయని చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలి నుంచీ చెబుతున్నవేనని గుర్తుచేశారు. విశాఖలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడారు. గతంలో వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకున్న కార్పొరేట్ల వల్ల ఏం ఒరిగిందని ప్రశ్నించారు. ఆ భూముల్లో గడ్డి తుప్పలు మాత్రమే మొలిచాయని, ఏ పరిశ్రమా రాలేదని వివరించారు. భూముల కోసం తప్ప, పెట్టుబడి ఆసక్తి లేదన్నారు. ఐటి మంత్రి లోకేష్ గడిచిన 17 నెలల్లో రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులను ఆకర్షిస్తే ఈ డబ్బంతా ఎక్కడికెళ్లిందని ప్రశ్నించారు. కార్యాచరణ లేకుండా ఊదరగొట్టడం చంద్రబాబు, పవన్, లోకేష్‌కు అలవాటుగా మారిందన్నారు.



మాట్లాడుతున్న బివి రాఘవులు

పెట్టుబడులు ఎక్కడ?

2014-24 మధ్యకాలంలో మిగతా 7లో

'ఇండిగో'పై వివరణ ఇవ్వాల్సిందే !

- రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్
- అంతర్గత సమస్యల వల్లే! : మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇండిగో సంక్షోభంపై రాజ్యసభలో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాయి. ఇండిగో అంతర్గత సమస్యల వల్లే ఈ సంక్షోభం తలెత్తిందని, పైలట్ రోస్టర్, క్రూ సిబ్బంది సమస్యల వల్లే విమాన సర్వీసులు రద్దయ్యాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇండిగో సంక్షోభంపై సోమవారం రాజ్యసభలో ఎంపి ప్రమోద్ తివారీ లేవనెత్తిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'ఇండిగో సంక్షోభాన్ని ప్రభుత్వం తేలిగ్గా తీసుకోవడం లేదు. దీనిపై ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నాం. అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. మొత్తంగా సమస్యను పరిష్కరించడానికి వెంటనే అప్రమత్తమయ్యాం. ఇండిగో సంక్షోభానికి దాని సిబ్బంది రోస్టరింగ్, అంతర్గత ప్రణాళిక వ్యవస్థలోని సమస్యలే కారణం. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (ఎఫ్‌డిటిఎల్) నియమాలతో ఎలాంటి సమస్యలూ లేవు. అందరితో చర్చించాకే ఎఫ్‌డిటిఎల్ నిబంధనలను రూపొందించాం. నెల వరకూ సజావుగానే విమాన సర్వీసులు నడిచాయి. ఈ నెల 1న జరిగిన సమావేశంలోనూ ఇండిగో ఎలాంటి సమస్యనూ లేవనెత్తలేదు. ఈ నెల 2 నుండే సమస్య మొదలైంది. ఇండిగో విమానాల రద్దు, ఆలస్యం కారణంగా లక్షలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులకు కలిగిన ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం' అని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో టికెట్ ధరలు పెంచకుండా పరిమితి విధించినట్లు కూడా తెలిపారు. టికెట్ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఇండిగో సంక్షోభం కారణంగా 5,86,700 విమాన టికెట్లు రద్దయ్యాయని తెలిపారు. ఇండిగో సంక్షోభంపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఇచ్చిన సమాధానంపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ గందరగోళం కారణంగా సభ మధ్యాహ్నం 2గంటలకు వాయిదా పడింది. మరోవైపు లోక్‌సభలోనూ ఇదే అంశాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తాయి. ఇండిగో సమస్యపై ప్రభుత్వం ఏం చేస్తోందో దేశ ప్రజలకు చెప్పాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు ఇండిగో సంక్షోభంపై మంగళవారం ప్రకటన చేస్తారని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తరువాత కాంగ్రెస్ ఉప నేత గౌరవ్ గగోయ్ మాట్లాడుతూ, ఇండిగో సంక్షోభం గురించి పౌర విమానయాన శాఖ వివరించాలన్నారు. డయాలసిస్ పేషెంట్లు, వృద్ధులు సహా పెళ్ళిళ్ళు వంటి అత్యవసర కార్యక్రమాలకు హాజరు కావాల్సిన వారు ఎంతో మంది విమానాశ్రయాల్లో చిక్కుకుపోతున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ ఇటువంటి సంక్షోభాన్ని చూడలేదన్నారు. రెండు సంస్థలకే ఆధిపత్యం సృష్టించడానికి తీసుకువస్తున్న ఒత్తిళ్ళ వల్లే ఇదంతా జరిగిందని విమర్శించారు. ఇప్పుడు విమాన టికెట్‌పై రూ.20 వేలు పెరిగినట్లు ఆయన తెలిపారు.



ఇండిగో సంక్షోభంపై సంస్థాగత విచారణ

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

7

రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులపై 'బ్యాంకు' బృందం వద్ద రైతుల ఏకరువు

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాష్ట్ర రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ప్రపంచ బ్యాంక్ ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి) బృందాలు సోమవారం సిఆర్‌డిఎ పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించాయి. రైతులు, అసైన్డ్ రైతులతో సమావేశమైంది. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఈ బృందం సభ్యుల వద్ద ఏకరువు పెట్టారు. రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్లాట్ల అభివృద్ధి, గ్రామకంఠాలు, జరీబు భూములు, స్మశానాల సమస్యలను ఈ సమావేశంలో లేవనెత్తారు. రాజధానిలోని విద్యా సంస్థల్లో చదివే రైతుల, ఇతరుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని, నిర్మాణ పనుల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, రాజధాని వాసులకు గుర్తింపు కార్డులు కావాలని కోరారు. సీడ్ యాక్సెస్ రోడ్డును కలుపుతూ గ్రామాల్లో రోడ్లు నిర్మించాలని, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రపంచ బ్యాంకు, ఎడిబి బృందాల్లోని ప్రతినిధులు స్పందిస్తూ, రైతులు దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై సిఆర్‌డిఎ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అమలులో భాగంగా రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ ఫ్లో నిర్వహణ, రహదారులు, బిఆర్‌టి ప్రణాళిక తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అమలు కావాల్సిన కార్యకలాపాలపై ఈ బృందాలు రాయపూడిలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో అధికారులతో చర్చలు జరిపాయి. రాజధానిలో చేపట్టిన నిర్మాణాలపై బ్యాంకుల ప్రతినిధులకు సిఆర్‌డిఎ అధికారులు వివరించారు. రాజధాని ప్రాంతంలో గ్రామస్తులు, రైతులు, రైతు కూలీలకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, స్థానికుల నుంచి వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారానికి అమలవుతున్న కార్యకలాపాలపై తెలియజేశారు. అమరావతిలో క్షేత్రస్థాయిలో పర్యటించిన బృందం రాయపూడిలో స్థానికులతో సమావేశమై భూ సమీకరణ పథకం, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలతోపాటు పలు అంశాలు చర్చించింది. నిర్మాణ కంపెనీలు ఆర్‌విఆర్, ఎన్‌సిసి సంస్థల లేబర్ క్యాంపులను సందర్శించింది. అమరావతి నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కార్మికుల కోసం అమలవుతున్న ఆరోగ్య భద్రతా నియమాలు, క్యాంపు సైట్‌లను పరిశీలించి కార్మికులతో బృందంలోని సభ్యులు మాట్లాడారు. సిఆర్‌డిఎ అధికారులు, కార్మికులతో కలిసి మొక్కలు నాటారు. రాజధాని ప్రాంతంలో అమలవుతున్న సామాజిక, పర్యావరణ ప్రణాళికలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.



రాజధాని ప్రాంతం రాయపూడిలో రైతులతో సమావేశమైన ప్రపంచ బ్యాంకు బృందం

1,566కు స్క్రబ్ టైఫస్ కేసులు

- ఇప్పటి వరకు 9 మరణాలు అనుమానిత కేసులే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇప్పటి వరకు 1,566 స్క్రబ్ టైఫస్ జ్వరాల కేసులు నమోదయ్యాయని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. స్క్రబ్ టైఫస్‌పై మంగళగిరిలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్క్రబ్ జ్వరం వచ్చి మరణించిన వారిలో 9 మంది ఉన్నా ఇవి దేనివల్ల జరిగాయన్న దానిపై పరిశోధన జరగాల్సి ఉందని చెప్పారు. ఇందుకు కనీసం రెండు నెలల నుంచి మూడు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందని సూత్రప్రాయంగా తెలిపారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ స్వీకెన్సీ (గుంటూరు, తిరుపతి) ద్వారా పరీక్ష చేయించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. స్క్రబ్ టైఫస్ జ్వరాలు సాధారణమైన వాటిల్లో ఒకటని పేర్కొన్నారు. రాష్ట్రంలో కంటే ఈ కేసులు కర్ణాటక, తమిళనాడులో అత్యధికమన్నారు. బోధనాస్పత్రుల్లో ఉండే ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్ఆర్)లు అధిక కేసులు, అసాధారణ మరణాలు సంభవించిన చోట పరిశోధన చేస్తాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ బృందాలు ఉన్నాయన్నారు.

రూ.7 లక్షల కోట్లు ఆవిరి

- దలాల్ స్ట్రీట్‌కు ఎఫ్ఐఐ సెగలు
- సెన్సెక్స్ 600 పాయింట్ల పతనం
- ఇండిగో షేర్ల కుదేలు



ముంబయి : భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ మదుపర్లు ముఖం చాటేస్తోన్నారు. వరుస అమ్మకాలతో దలాల్ స్ట్రీట్‌కు సెగలు పుట్టిస్తున్నారు. రూపాయి రికార్డ్ పతనం, భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంపై సానుకూల సంకేతాలు కానరాకపోవడం, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలతో సోమవారం సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలాయి. బిఎస్ఇ సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కొనసాగి.. తుదకు 610 పాయింట్లు లేదా 0.71 శాతం పతనమై 85,103కు పరిమితమైంది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 226 పాయింట్లు లేదా 0.86 శాతం కోల్పోయి 25,961 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్లకు పైగా నష్టపోయింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.7 లక్షల కోట్లపైగా ఆవిరై రూ.463 లక్షల కోట్లకు తగ్గింది. దీంతో ఒక్కపూటలోనే ఇన్వెస్టర్ల సంపద రూ.7 లక్షల కోట్లు కరిగిపోయినట్లయ్యింది.

సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి మినహా మిగిలిన 27 షేర్లూ ప్రతికూలతను చవిచూశాయి. బిఇఎల్, ఎటెర్నెల్, ట్రెంట్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ అధికంగా నష్టపోయాయి. యుఎస్ ఫెడ్ ఈ నెల 10న వడ్డీ రేట్లను తగ్గించనుందనే అంచనాలతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి శుక్రవారం ఒక్క పూటలోనే రూ.439 కోట్లను ఉపసంహరించుకోగా.. డిసెంబర్‌లో ఇప్పటివరకు రూ.6,584 కోట్ల విలువైన స్టాక్స్‌ను తరలించుకుపోయారు. ఇది మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచిందని నిపుణులు భావిస్తున్నారు. ఇండిగోలో నెలకొన్న సంక్షోభంతో దాని మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్లలో భారీగా క్షీణించాయి. ఇప్పటికే గత ఐదు సెషన్లలో 9 శాతానికి పైగా నష్టపోగా.. సోమవారం సెషన్‌లో ఏకంగా 8.28 శాతం లేదా రూ.444.75 నష్టంతో రూ.4,926.55 వద్ద ముగిసింది.

లైంగిక దాడి కేసు విచారణకు ఒడిశాకు పోలీస్ బృందం

- హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి సంస్కృత యూనివర్సిటీలో లైంగికదాడి ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఒడిశాకు పోలీస్ బృందం వెళ్లిందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ ఘటనపై తిరుపతి ఎస్పి, పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసును తిరుపతి రూరల్ ఎస్పి పర్సనల్‌గా పర్యవేక్షిస్తున్నారన్నారు. మహిళల రక్షణే తమ ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థికి అన్ని విధాలా న్యాయం చేస్తామని, బాధ్యులైన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

పార్లమెంటులో వాయిదా తీర్మానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్, డ్రగ్స్ ఘటనపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు వైసిపి ఎంపి మద్దిల గురుమూర్తి లోక్‌సభలో అడ్జర్న్‌మెంట్ మోషన్ నోటీసు ఇచ్చారు. బిఇడి మొదటి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థినిని, అదే వర్సిటీలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగికంగా వేధించడం, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని బెదిరించడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. హాస్టల్ గదుల తనిఖీల్లో 20 గంజాయి ప్యాకెట్లు బయటపడటం, క్యాంపస్ భద్రతా వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయన్నారు. క్యాంపస్ భద్రతను బలోపేతం చేయాలని, డ్రగ్-ఫ్రీ వాతావరణాన్ని ఏర్పరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు.

గమనిక

నిన్నటి అక్షరం పేజీలో ఇచ్చిన 'హలో హలో ఎస్ఎఫ్ఐ' పాటకు 'హలో హలో ఎస్ఎఫ్ఐ - మేము రెడీ సైసైసై' అనే పల్లవి చేర్చి చదువుకోగలరు.

- ఎడిటర్

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

'విశాఖ ఉక్కు'పై బిజెపివి కల్లబొల్లి మాటలే

- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేది లేదంటూనే అప్పనంగా అదాని చేతిలో పెడుతున్నారని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని, అమ్మబోమని బిజెపి చెప్పేవన్నీ కల్లబొల్లి మాటలేనని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త నియామకాలు లేకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్లాంట్ భూములను అదానికి ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఒక్కొక్కటిగా అదానికి అప్పగిస్తూ రాష్ట్రాన్ని అదాని ప్రదేశ్‌గా మార్చాలని చూస్తున్నారన్నారు. విశాఖ ఉక్కును అమ్మే కుట్రలో కర్త మోడీ అయితే క్రియ చంద్రబాబు అని పేర్కొన్నారు. పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా నష్టాల సాకు చూపి ఉద్యోగులను వేధిస్తున్నారని తెలిపారు. పనికొద్దీ జీతమని ప్రపంచంలో ఎక్కడా లేని రూల్స్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్టీల్ ఉత్పత్తికి కావాల్సిన ముడి సరుకును ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును అమ్మేది లేదని ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

న్యాయం కోసం..

ఉక్కు నిర్వాసితుల భారీ ఆందోళన

- స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములిచ్చి 40 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ న్యాయం జరగలేదంటూ నిర్వాసితులు సోమవారం పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. తమకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తూ వారంతా ఉక్కు నిర్వాసిత ఐక్య సంఘం ఆధ్వర్యంలో 'చలో విశాఖ స్టీల్ ప్లాంట్ మెయిన్ గేట్' పేరిట ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్లాంట్ కోసం భూములిచ్చిన వారిలో ఆర్ కార్డు కలిగిన కుటుంబాలకు నేటికీ ఉద్యోగాలివ్వలేదన్నారు. ప్రత్యామ్నాయంగా భూమినీ కేటాయించలేదని, దాదాపు 8,500 మంది భూ నిర్వాసితులకు న్యాయం జరగాల్సి ఉందని స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్దకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నిర్వాసితులంతా రోడ్డుపై బైఠాయించడంతో స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే ప్రధాన రహదారి మూసుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోగా అక్కడ కాసేపు వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.

సమస్య పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం

తమ సమస్య పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం కొనసాగుతుందని నిర్వాసితులు స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలు గడిచినా ఉద్యోగ వాగ్దానం నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇవ్వాలని, లేనిపక్షంలో మిగులు భూములను ఒక్కొక్కరికీ ఎకరం చొప్పున పంచాలని, ఉద్యోగం ఇచ్చే వరకు జీవన భృతిగా నెలకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు ఎదుట భారీ ఆందోళనకు దిగిన ఉక్కు నిర్వాసితులు

వడ్డే శోభనాద్రీశ్వరరావు మద్దతు

నిర్వాసితుల పోరాటానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మద్దతు తెలిపారు. వృద్ధాప్య దశలో ఉన్న ఆయన అక్కడకు వచ్చి సంఘీభావం ప్రకటించడం పలువురికి స్ఫూర్తినిచ్చింది. నిర్వాసితుల పోరాటానికి మద్దతు తెలిపిన వారిలో వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయ కర్త తిప్పల దేవన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి, సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు తదితరులున్నారు. నిర్వాసిత సంఘం నాయకులు పితాని భాస్కరరావు, ఉక్కు కార్మిక సంఘం నాయకులు డి.ఆదినారాయణ, పెద్ద సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ పెంచాలని చలో ఢిల్లీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇపిఎస్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం, బుధవారం ఢిల్లీలో జరిగే సదస్సు, ధర్నా కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పెద్దయెత్తున పెన్షనర్లు ఢిల్లీకి చేరుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు తెలిపారు. ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇపిఎఫ్ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యాన డిసెంబరు 9న ఢిల్లీలోని సుజిత్ భవన్‌లో సదస్సు, 10న జంతర్ మంతర్ వద్ద ధర్నా జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి 200 మంది పెన్షనర్లు ఢిల్లీకి చేరుకున్నారు.

ఈ సందర్భంగా కె సత్తిరాజు మాట్లాడుతూ.. గత 11 ఏళ్లుగా సిపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ డిఎతో కలిపి రూ.9 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అదేవిధంగా 2014 అక్టోబరు ఒకటి తరువాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 17.5 లక్షల పెన్షనర్లు హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తులు చేసుకుంటే, కేవలం 50 వేల మందికి అమలు చేస్తున్నారని విమర్శించారు. కొందరు పెన్షనర్లకు డిమాండ్ నోటీసులు వచ్చి సకాలంలో డబ్బులు చెల్లించలేని వారికి మరొక అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇపిఎస్ పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్లకు రైల్వేలో రాయితీలు పునరుద్ధరణ చేయాలని, ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు 2025ను రద్దు చేయాలని కోరారు. కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల వలే ఇపిఎస్ పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే సామాజిక పెన్షన్ రూ.4 వేలు చెల్లించాలని సిఎం చంద్రబాబును కోరామన్నారు. రాష్ట్ర కార్యదర్శి కె సుధాకర్‌రావు, కె బాబురావు, యుఎస్ఎన్ రెడ్డి, ఎస్‌కె హుస్సేన్, పి శ్రీనివాసరావు, జార్జ్ బర్న్ బస, పున్నారావు, బివి రావు తదితరులు ఢిల్లీకి చేరుకున్నారు.





గ్రామ కంఠాలను పరిశీలిస్తున్న భార్గవతేజ

రాజధానిలో గ్రామకంఠాల పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని నేలపాడులో గ్రామ కంఠాలను సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ భార్గవతేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఎస్.భాగ్యరేఖ సోమవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించేందుకు రైతులను కలిసి వారితో మాట్లాడారు. గ్రామకంఠాల సమస్యల గురించి అడిషనల్ కమిషనర్‌కు రైతులు, స్థానికులు వివరించారు. గ్రామాల్లో పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులు, ఇళ్లు, స్థలాలకు సంబంధించిన పలు అంశాలను వారు అధికారులకు వివరించారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మున్సిపల్ శాఖ నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. రైతుల సమస్యలపై ఇటీవల త్రిసభ్య కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామకంఠాల సమస్యను నెలరోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో అదనపు కమిషనర్ నేలపాడులో పర్యటించారు.

బెల్ట్‌షాపులపై భగ్గుమన్న మహిళలు

- అక్రమంగా దాచిన మద్యం సీసాలను వీధిలోకి తీసుకొచ్చి దహనం
- ఇకపై మద్యం అమ్మితే 'ఖబడ్దార్' అంటూ హెచ్చరిక

ప్రజాశక్తి- పంగులూరు (బాపట్ల జిల్లా)

బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా మహిళలు సోమవారం రాత్రి ఉద్యమించారు. ర్యాలీగా వెళ్లి బాపట్ల జిల్లా పంగులూరు మండలం కోటపాడు గ్రామంలోని బెల్ట్ షాపులపై దాడి చేశారు. అక్రమంగా దాచిన మద్యం సీసాలను బయటకు తీసుకొచ్చి వీధిలో తగలబెట్టారు. ఇకనుంచి మద్యం అమ్మితే ఊరుకునేది లేదని నిర్వాహకులను హెచ్చరిక చేశారు. మద్యం వల్ల మా కుటుంబాలు నాశనమవుతున్నాయని, కుటుంబాల్లో కలహాలు చెలరేగి భార్యాభర్తలు విడిపోతున్నారని, పిల్లల భవిష్యత్తు దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే తమ తడాఖా చూపిస్తామని మహిళలు హెచ్చరించారు. వీరికి గ్రామస్తులంతా వీధిలోకి వచ్చి మద్దతు తెలిపారు. మద్యం షాపులను నిర్వాహకులను కట్టడి చేయండి అంటూ ప్రోత్సహించారు. ఐద్వా అఖిల భారత నాయకురాలు డి.రమాదేవి సోమవారం రాత్రి కోటపాడు గ్రామంలోని దళిత కాలనీలో మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మా గ్రామంలో ఏడు బెల్ట్ షాపులు నడుస్తున్నాయని, మద్యం వల్ల మా కుటుంబాలు సర్వనాశనమవుతున్నాయని తెలిపారు. మా గ్రామంలో మద్యం అమ్మడానికి వీల్లేదని, ఇందుకోసం ఏ పోరాటానికైనా సిద్ధమేనని చెప్పారు. అనంతరం మహిళలంతా బెల్ట్ షాపులపై దాడికి కదిలారు. తొలుత దళిత కాలనీ పక్కనే ఉన్న బత్తుల కొండలు బెల్ట్ షాపుపై దాడి చేశారు. మద్యం సీసాల కోసం వెతికారు. ముందుగానే సమాచారం అందుకున్న కొండలు వాటిని వేరేచోటకు పంపాడని తెలుసుకొని మహిళలు అక్కడి నుండి ఇరగని గోవిందమ్మ బెల్ట్ షాపు వద్దకు వెళ్లారు. ఆమెతో మాట్లాడారు. పంగులూరు, ముప్పవరం బ్రాందీ షాపుల నుండి మద్యం బాటిళ్లు తీసుకొస్తున్నానని, రోజుకు పది క్వార్టర్ల మద్యం అమ్ముతున్నానని, రూ.400 ఆదాయం వస్తోందని గోవిందరమ్మ చెప్పారు. ఇక నుండి మద్యం అమ్మితే ఊరుకోబోమని మహిళలు హెచ్చరించారు. ఆ తర్వాత గ్రంధి రామారావు, గ్రంధి మహాలక్ష్మి బెల్ట్ షాపులపై దాడి చేశారు. ఈ సందర్భంగా బెల్ట్ షాపు నిర్వాహకులకు, వారికి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మహిళలు వారి ఇంట్లోకి వెళ్లి దాచిపెట్టిన మద్యం సీసాలను, గ్లాసులను, కాళీ మద్యం సీసాలను బయటకు తీసుకొచ్చి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మద్యం వల్ల అనేక కుటుంబాలు సర్వనాశనమవుతున్నా ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోందని, మద్యం షాపుల్లో ఎమ్మెల్యేలకు కూడా వాటాలు ఉన్నాయని అన్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బులను కొందరు మద్యానికి ఖర్చు పెడుతున్నారని, అటువంటి వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని తెలిపారు. గంజాయిని నిలువరించేందుకు నెల్లూరు జిల్లాలో పోరాడుతున్న పెంచలయ్యను గంజాయి ముఠా దారుణంగా హత్య చేసిందని, దానిపై ఇంతవరకు ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదని అన్నారు. మద్యానికి, బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా మహిళలంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు, సభ్యుడు గుడిపాటి మల్లారెడ్డి మాట్లాడుతూ గతంలో ఇక్కడ బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా మహిళలు పోరాడారని, మరోసారి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలు 'బెల్ట్ షాపులను నివారించాలి, బెల్టు షాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి, మా ఊరికి మద్యం వద్దు, గంజాయి గుండాల దాడికి బలైన పెంచలయ్యకు జోహార్' అంటూ నినాదాలు చేశారు.



బెల్ట్ షాపులు మూయించేందుకు వెళ్తున్న మహిళలు

డ్రోన్ సేవల విస్తరణకు ప్రత్యేక మాస్టర్‌ప్లాన్

- ఆర్‌టిజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డ్రోన్ సేవలను మరింత విస్తృతం చేయాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ దిశగా ఆయా శాఖలన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సంక్రాంతి నుంచి పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలన్నారు. ఆర్‌టిజిఎస్‌పై సిఎం సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని శాఖలు భౌతికంగానే సేవలందిస్తున్నాయని, అలాంటి శాఖలు వెంటనే తమ పంథా మార్చుకుని ప్రజలకు ఆన్‌లైన్‌లో సేవలందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలన్నీ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. రిజిస్ట్రేషన్ల అనంతరం డాక్యుమెంట్లు కొరియర్ ద్వారా నేరుగా సంబంధిత వ్యక్తుల ఇళ్లకే పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్‌టిసి సేవలు మరింత మెరుగయ్యేలా చూడాలన్నారు. బస్టాండు ప్రాంగణం, పరిసరాలు, టాయిలెట్ల వద్ద పరిశుభ్రత పాటించేలా చర్యలు ఉండాలన్నారు. భవిష్యత్తులో డ్రోన్ల ఉపయోగం గణనీయంగా పెరుగుతుందన్నారు. పురుగు మందుల వినియోగం తగ్గించేందుకు డ్రోన్లను ఎలా వాడుకోవచ్చునే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ ద్వారా వ్యాధుల వ్యాప్తి లేకుండా చేయొచ్చన్నారు. కొన్ని జిల్లాల్లో కొంతమంది అధికారులు మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, వాటిని మిగిలిన జిల్లాల్లోనూ అమలయ్యేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో సిఎస్ విజయానంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తెలుగు మహాసభలకు సిపిఎం నాయకులను ఆహ్వానిస్తున్న గజల్ శ్రీనివాస్

ప్రపంచ తెలుగు మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విఎస్ఆర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యాన వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5వ తేదీ వరకూ నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావును పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆహ్వానించారు. విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో వి శ్రీనివాసరావును సోమవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. గుంటూరులోని అమరావతి శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో, శ్రీ నందమూరి తారక రామారావు వేదికపై జనవరి 5న సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా హాజరు కావాలని కోరారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావునూ ఈ మహాసభలకు ఆహ్వానించారు.

ఎపిఐఐసి కార్యాలయం ముట్టడి

- రాయితీలు విడుదల చేయాలి
- ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామిక వేత్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రావాల్సిన రాయితీలను విడుదల చేయాలంటూ మంగళగిరి ఎపిఐఐసి కార్యాలయాన్ని ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామిక వేత్తలు సోమవారం ముట్టడించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, పారిశ్రామిక వేత్తల రాయితీలు విడుదల చేసే వరకు తాము ఇక్కడ నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2013లో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం చేసినప్పటికీ దానిని పూర్తిగా నీరుగార్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు నెలలో వెయ్యికోట్లకు పైగా రాయితీలు ఇవ్వలేదని, ఆర్‌టిసి బస్సులకు రూ.56 కోట్లు కేటాయించారని, ఆ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. తమకు రాయితీలు విడుదల చేయకపోతే తమకు ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా పరిశ్రమలకు వందల కోట్లు కేటాయించి ఎస్‌సి, ఎస్‌టిల్లో 90 శాతం నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి నాయకులు అనార్‌బాబు, రాజశేఖర్, కె సత్యనారాయణ, కె సత్య, త్రిమూర్తులు, చినమ ఔలాలి, నాగ కుమార్, భక్తవత్సలం, మహిళా నాయకులు సత్య నాగలక్ష్మి, మేరి, మరియమ్మ, నయోమి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ డైరెక్టర్ రామలింగరాజు జెఎసి నేతలతో చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

శ్రీశైలం ప్లంజ్‌పూల్ గొయ్యి మరమ్మతులు చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన గొయ్యికి మరమ్మతులు చేపట్టి, దెబ్బతిన్న సిలిండర్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య కోరారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు సోమవారం ఆయన లేఖ రాశారు. శ్రీశైలం డ్యామ్ భద్రతలో అత్యంత కీలకమైనవి సిలిండర్లు అని, డ్యామ్ నిర్మాణ సమయంలో ఆనకట్ట ముందు భాగంలోని రాళ్లు కొట్టుకుపోయాయన్నారు. ప్రస్తుతం డ్యామ్ ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి మరింత పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. డ్యామ్ రక్షణకు అమర్చిన 67 సిలిండర్లలో 62 దెబ్బతినడం ప్రమాదానికి సంకేతాలుగా అధ్యయన సంస్థలు తమ నివేదికల్లో స్పష్టం చేశాయని పేర్కొన్నారు. 2018లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ అనే సంస్థ అధ్యయనం చేసి గొయ్యి 42 మీటర్ల లోతులో ఉందని నివేదిక ఇచ్చినప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడం విచారకరమని తెలిపారు.

తల్లి కళ్లెదుటే కుమార్తె దారుణ హత్య

- ముషీరాబాద్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరుసకు మరదలైన యువతితో పెళ్లికి ఆమె కుటుంబీకులు నిరాకరించడంతో కక్ష పెంచుకున్న యువకుడు.. ఆ యువతి ఇంట్లోకి చొరబడి ఆమె తల్లి కళ్లదెటే ఆమెను దారుణంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన హైదరాబాద్ ముషీరాబాద్ డివిజన్ వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపూజీనగర్ నగర్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపూజీనగర్ నివాసముండే కాంతారావు, లక్ష్మి దంపతుల కుమార్తె పవిత్ర (19) ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటున్నారు. పవిత్రకు బావ వరసయ్యే రహమత్‌నగర్ చెందిన ఉమాశంకర్ టైల్స్ వేసే పనిచేస్తూ జీవిస్తున్నాడు. పవిత్రను పెళ్లి చేసుకుంటానని ఆమె తల్లిదండ్రులకు తెలుపగా వారు నిరాకరించారు. దీంతో కక్ష పెంచుకున్న ఉమాశంకర్ సోమవారం మధ్యాహ్నం ఇంట్లో తల్లీకూతుళ్లు ఉన్న సమయంలో వచ్చి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న కత్తితో మరదలి మెడపై పొడిచాడు. దాంతో, ఆమె అక్కడికక్కడే ప్రాణం విడిచారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై 11న తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసు ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. ఈ నెల 11న తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. ఈ మేరకు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఆదేశాలు జారీ చేశారు. రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై గత వారంలోనే హైకోర్టు ఇరుపక్షాలను రాతపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశించింది. సోమవారం సిఐడి సిట్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కెసిరెడ్డి తరపున న్యాయవాది యుగంధర్ రెడ్డి హాజరయ్యారు. కోర్టు ఆదేశాల మేరకు రాతపూర్వక వాదనలను సమర్పిస్తామన్న వారి హామీలను హైకోర్టు రికార్డు చేసింది. తీర్పును ఈ నెల 11న చెబుతామని వెల్లడించింది.

8 నుంచి జాతీయ హస్తకళా వారోత్సవాలు

- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ హరిప్రసాద్

ప్రజాశక్తి - విజయవాడ

హస్తకళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు, సాధికారత సాధించేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ (ఎపిహెచ్‌డిసి) చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. ఈ నెల ఎనిమిది నుంచి 14 వరకు జరిగే జాతీయ హస్తకళా వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ గాంధీనగర్ లేపాక్షి ఎంపోరియంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ... ఈనెల పదిన వైఎస్ఆర్ కడప జిల్లా ఒనిపెంటలో 'గురుశిష్య హస్తశిల్ప్ ప్రశిక్షణ్' ప్రోగ్రామ్ (జిఎస్‌హెచ్‌పిపి) ద్వారా 30 మంది హస్తకళాకారులకు ఇత్తడి, కంచులోహపు వస్తువుల తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 12న పల్నాడు జిల్లా దుర్గిలో 30 మంది కళాకారులకు డిజైన్ వర్క్‌షాప్, 13న తిరుపతి జిల్లా మాధవమాల, శ్రీకాళహస్తిలో కలప చెక్క కళాకారులకు, 14న అనకాపల్లి జిల్లా కెడిపేటలో 50 మంది కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు రాజమహేంద్రవరంలో 40 మంది కళాకారులతో ఏడు రోజుల గాంధీ శిల్ప్ బజార్, 17న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 50 మంది శిలా శిల్పకళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ ఉంటుందన్నారు. ఈనెల తొమ్మిన భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగే హస్తకళా అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి చేతుల మీదుగా మన రాష్ట్రానికి చెందిన ముగ్గురు కళాకారులు అవార్డు అందుకోనున్నారని తెలిపారు. 2024 జాతీయ హస్తకళా అవార్డుకు డి.శివమ్మ (తోలుబొమ్మలాట, శిల్పగురు అవార్డు), గోర్స సంతోష్ (ఏటికొప్పాక బొమ్మలు), 2023 జాతీయ అవార్డుకు పి.విజయలక్ష్మి (కలంకారి హ్యాండ్ పెయింటింగ్) ఎంపికయ్యారని వివరించారు. కళాకారులకు అవసరమైన చెక్కను అందుబాటులో ఉంచేందుకు ఉడ్ బ్యాంక్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా లేపాక్షి ఎంపోరియంను హరిప్రసాద్ పరిశీలించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ విసి అండ్ ఎమ్‌డి ఎం.విశ్వ, లేపాక్షి ఓఎస్‌డి ఐవి లక్ష్మీనాథ్, ఎంపోరియం మేనేజర్ ఎం.సురేష్ పాల్గొన్నారు.



వెబ్‌సైట్‌లో లైబ్రరీ, సమాచార సైన్స్ పరీక్ష హాల్ టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రంథాలయ, సమాచార సైన్స్ (సిఎల్ఎస్‌సి) పరీక్ష హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. అభ్యర్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.


ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్ష గుంటూరు, కడప కేంద్రాల్లో మాత్రమే నిర్వహిస్తామని వెల్లడించారు.

హజ్ యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు

- హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా

ప్రజాశకి - అమరావతి బ్యూరో

వచ్చే ఏడాది హజ్ యాత్రకు వెళ్లే హాజీల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా ఆదేశించారు. 2025 హజ్ సందర్భంగా హాజీలకు ఎదురైన అసౌకర్యాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడలోని రాష్ట్ర హజ్ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఛైర్మన్ అధ్యక్షతన ఐదవ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడ ఎంబర్కేషన్ పాయింట్‌ను మరింత అభివృద్ధి చేయడంతోపాటు ప్రతి హాజీకి ప్రభుత్వ సహకారం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడలోని హజ్ హౌస్ స్థలం, భవన నిర్మాణ విషయంలో కూటమి ప్రభుత్వ సహకారాన్ని సాకారం చేసుకోవడంపై కూడా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గౌస్‌పీర్, హజ్ కమిటీ డైరెక్టర్లు మీరాసాహెబ్, మీర్జా అబీద్‌హుస్సేన్, ఎస్ బాబా ఫక్రుద్దీన్, పఠాన్ ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రహ్లాద్ జోషితో మాట్లాడుతున్న నాదేండ్ల మనోహర్

అదనపు గొడౌన్లు ఏర్పాటు చేయాలి

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి నాదెండ్ల వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఎఫ్‌సిఐ ద్వారా అదనపు గొడౌన్లను ఏర్పాటు చేయాలని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. సోమవారం నాడిక్కడ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో ఆయన భేటీ అయ్యారు. అనంతరం ఎపి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) నుంచి అదనపు గొడౌన్లు ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేశారన్నారు. 2026 జనవరి నుంచి రాష్ట్రానికి గోధుమలు, అదనంగా రాగులు కేటాయించేందుకు కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేశారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య విధానంలో స్టీల్ సైలోలు నిర్మించడానికి కేంద్రం అంగీకరించిందని తెలిపారు. ఈ సైలోలు నిల్వ నష్టం తగ్గించడంలో సహాయపడతాయని, ధాన్యం నాణ్యతను మెరుగుపరుస్తాయని అన్నారు. పౌర సరఫరాల వ్యవస్థ (పిడిఎస్) కింద రాష్ట్రంలో గొడౌన్ల నిర్మాణానికి కేంద్రం సహాయం అందించనుందని తెలిపారు.

'సూపర్ స్మెల్టర్స్'కు భూములివ్వం

కలెక్టరేట్ వద్ద రైతు, కౌలురైతు సంఘాలు, వ్యకాస ఆధ్వర్యాన ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

సూపర్ స్మెల్టర్స్ స్టీల్‌ప్లాంట్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ భూములిచ్చేది లేదని విజయనగరం జిల్లా గుర్ల మండల రైతులు తేల్చిచెప్పారు. ఈ మేరకు 'మా ఊరు- మా భూమి - మా హక్కు' కార్యక్రమంలో భాగంగా ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం సంయుక్త ఆధ్వర్యాన విజయనగరం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. భూసేకరణకు వ్యతిరేకంగా గుర్ల మండలంలోని దమరసింగి, కెల్ల, బెల్లానపేట, మన్యపురిపేట, ఎస్‌ఎస్‌ఆర్‌పేట, వల్లాపురం గ్రామాల రైతులు.. పిల్లాపాపలతో సైతం ధర్నాకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు వస్తున్నాయంటూ చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దానిని సరిదిద్దే ప్రయత్నం చేయడంలేదని, ఇప్పుడు సూపర్ స్మెల్టర్స్ ఉక్కు కర్మాగారానికి ఏమైనా లాభం వస్తుందా? అని ప్రశ్నించారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల ఎకరాల భూములను రైతుల నుంచి సేకరించారని, అందులో కనీసం పది శాతం కూడా అభివృద్ధి జరగలేదని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు భూములివ్వరని స్పష్టంచేశారు. అనంతరం ధర్నా వద్దకు వచ్చిన డిఆర్‌ఒ మురళికి వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లోకి సర్వే పేరిట అధికారులు ఎవరూ రారని డిఆర్‌ఒ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ధర్నాకు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి సూర్యనారాయణరాజు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, పాల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొంప కృష్ణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, దమరసింగి సర్పంచ్ మీసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి

మంత్రి కుమారుడిపై చర్యలు తీసుకోవాలి

- పిఎను అరెస్టు చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐద్వా, శ్రామిక మహిళా సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఒంటరి మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కుమారుడిపై కేసు నమోదు చేయాలని ఐద్వా, శ్రామిక మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్వతీపురం జిల్లా సుందరయ్య భవనంలో సోమవారం ఐద్వా జిల్లా అధ్యక్షులు ఆర్ శ్రీదేవి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పి రమణి, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ వి ఇందిర మాట్లాడారు. తనను మంత్రి వ్యక్తిగత సిబ్బంది, కుమారుడు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేశారంటూ సాలూరు పట్టణానికి చెందిన మహిళా ఉద్యోగి ఆధారాలతో కూడిన ఫిర్యాదును జిల్లా పోలీస్ అధికారులకు అందజేశారన్నారు. మంత్రి పిఎపై కేసు నమోదు చేసినప్పటికీ ఇంతవరకు ఆయనను అరెస్టు చేయలేదని, మంత్రి కుమారునిపైన కేసు కూడా నమోదు చేయలేదని తెలిపారు. ఈ తాత్సారానికి అధికార టిడిపి కూటమి నేతల రాజకీయ ఒత్తిడే కారణమని అన్నారు.

బాధిత మహిళకు హక్కుగా వచ్చిన సెలవు సైతం మంజూరు చేయడం లేదని, తాను పనిచేసిన కాలానికి చట్ట ప్రకారం చెల్లించాల్సిన జీతమూ చెల్లించకుండా కోతలు విధిస్తూ ఆమెను వేధింపులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిందితులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడతామని, నేరుగా ముఖ్యమంత్రికే ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు ఈ సమస్యపై వివరాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి తులసి, కుమారి, రాజేశ్వరి, భవాని, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 25వ రాష్ట్ర మహాసభ తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో డిసెంబర్ 12,13,14 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్ చెప్పారు. సోమవారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక, విద్యా కేంద్రమైన తిరుపతి నగరంలో 40 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న మహాసభ సందర్భంగా 12వ తేదీ ఉదయం పది గంటలకు ఆర్ట్స్ కాలేజీ నుంచి మున్సిపల్ గ్రౌండ్ వరకు వేలాది మంది విద్యార్థులతో ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

అనంతరం జరిగే బహిరంగ సభకు ఎస్‌ఎఫ్‌ఐ అఖిలభారత అధ్యక్ష, కార్యదర్శులు ఆదర్శ ఎం.సాజి, శ్రీజన్ భట్టాచార్య, ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు, అఖిల భారత నాయకులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం మాట్లాడుతూ ఈ మహాసభ ప్రారంభ సభ 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని, దీనికి మద్రాస్ హైకోర్టు రిటైర్ జడ్జి కె.చంద్రు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు.

మహాసభలో ఎస్‌ఎఫ్‌ఐ భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన జరుగుతుందన్నారు. అనేక విద్యావ్యతిరేక సమస్యలపై తీర్మానాలు చేస్తామని చెప్పారు. విలేకర్ల సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పవిత్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.


కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి వినతిపత్రం అందిస్తున్న క్రైస్తవ పెద్దలు

గొల్లప్రోలులో కొనసాగుతున్న ఉద్రిక్తత

- ప్రార్థనలను అడ్డుకున్న విహెచ్‌పి నాయకులు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన క్రైస్తవ పెద్దలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో ఉద్రిక్తత కొనసాగుతోంది. నగర పంచాయతీ పరిధిలోని కొత్తపేట కాలనీలో ఆదివారం క్రైస్తవులు ప్రార్థనలు చేసుకుంటుండగా కొంతమంది విహెచ్‌పి నాయకులు అడ్డుకున్నారు. స్థలాన్ని ఆక్రమించి చర్చి నిర్మించారంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇరువురికి సర్ధిచెప్పారు. ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ విధించారు. చర్చి వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. తమకు ప్రార్థనలు చేసుకునే హక్కును కల్పించండి అంటూ సోమవారం జిల్లాలోని అన్ని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కాకినాడలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలిని కలిసి వినతిపత్రం అందించారు. ముందస్తు సమాచారం లేకుండా ప్రార్థనా మందిరాన్ని మూసివేయడం చట్టపరంగా తప్పని, 40 ఏళ్లుగా సాగుతున్న చర్చిలను ఇప్పుడు నిలిపేయాలని అనడం తగదన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమస్యను శాంతియుతంగా పరిష్కరిస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చినట్లు క్రైస్తవ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్ ముసలే, స్థానిక సంఘం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జీతాల బకాయిల చెల్లింపునకు చర్యలు

- మంత్రి నారాయణ హామీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల జీతాల బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఆ శాఖ మంత్రి పి నారాయణ హామీ ఇచ్చారు. అమరావతిలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో మంత్రిని, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు కలిసి ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత 3 నుంచి 4 నెలలుగా మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గూడూరు, బేతంచర్ల, నాయుడు పేట మున్సిపాల్టీల్లో 4 నెలలుగా, ధర్మవరంలో 3 నెలలుగా జీతాల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా వైఎస్‌ఆర్ కడప, హిందూపురం, పుట్టపర్తి, తాడేపల్లిగూడెం, తణుకు, సూళ్లూరుపేట మున్సిపాల్టీల్లో నవంబరు నెల జీతాలు నేటికీ చెల్లించలేదని మంత్రికి వివరించారు. జులై సమ్మె కాలం జీతం చెల్లింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిల్లలకు ఉద్యోగాలు, రిటైర్మెంట్ వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు, సంక్షేమ పథకాలు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పంట వ్యర్థాల నిర్మూలనపై అవగాహన

- వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చడం (తగల బెట్టడం)తో నేలకు, పర్యావరణానికి కలిగే హాని, దుష్ప్రభావం గురించి వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలాని ఆదేశించారు. వరి పంటలో గత రెండు వారాలుగా కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, ఇప్పటికే కోతలు పూర్తయిన చోట కొందరు రైతులు రబీ పంట సాగు కోసం పంట వ్యర్థాలను, వరి దుబ్బులను కాల్చుతున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల జరిగే మేలు కంటే నష్టమే అధికమని శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలు మేరకు గ్రామస్థాయి సచివాలయ, రైతు సేవా కేంద్రం సిబ్బంది.. రైతులకు పంట వ్యర్థాలను కాల్చకుండా, భూమిలో కలిసిపోయేలా దున్నేయడమే మేలని అవగాహన కల్పించాలన్నారు.

విత్తన చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విత్తన చట్టం ప్రతులు దహనం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)


విత్తన చట్టం జిఒ కాపీలు దగ్ధం చేస్తున్న రైతు, కౌలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన చట్టం 2025ను ఉపసంహరించుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపులో భాగంగా ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిఒ కాపీలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ... ప్రైవేట్ కంపెనీల దోపిడీని కొనసాగించేందుకే ఈ చట్టం తీసుకువచ్చారని, దీని వలన వ్యవసాయ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ మాట్లాడుతూ... భారతదేశ విత్తన రంగంపై బహుళ జాతి సంస్థల కార్పొరేట్ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి విత్తన చట్టం దారితీస్తుందన్నారు. ఆహార భద్రత, విత్తన స్వావలంబనను దెబ్బతీసే ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేస్తుందన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకాయలపాటి శివ నాగరాణి, రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, రాజధాని రైతు సంఘం నాయకులు ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టార్‌లింక్ నెల ఛార్జ్ రూ.8,600



న్యూఢిల్లీ : అమెరికా కుబేరుడు ఎలన్ మస్క్ తన 'స్టార్‌లింక్' శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు భారత్‌లో భారీగా వసూళ్లు చేయాలని నిర్ణయించారు. నెలకు వేలల్లోనే ఛార్జ్ చేయనుంది. నివాస నెలవారీ ప్లాన్ ధర రూ.8,600గా చెల్లించాల్సి ఉంటుందని ఆ సంస్థ సోమవారం వెల్లడించింది. అదనంగా హార్డ్‌వేర్ ఉపకరణాల ధరను రూ.34,000 నిర్ణయించింది. ఈ ప్లాన్‌లో అపరిమిత డేటా లభిస్తుందని స్టార్‌లింక్ పేర్కొంది. 30 రోజుల పాటు ఉచిత ట్రయల్స్‌ను ఇస్తున్నట్లు తెలిపింది. ఆ తర్వాత వసూళ్లను ప్రారంభించనుంది. ఇంత ధర చెల్లిస్తోన్నప్పటికీ ఎంత స్పీడ్‌తో నెట్ సేవలందించేదీ మాత్రం వెల్లడించలేదు. అదే విధంగా బిజినెస్ సబ్‌స్క్రిప్షన్ వివరాలు వెల్లడి కావాల్సి ఉంటుంది. నియంత్రణ సంస్థల నుంచి మరిన్ని అనుమతులు రావాల్సి ఉందని స్టార్‌లింక్ పేర్కొంది.

తెలుగులో మాట్లాడటం అలవర్చుకోవాలి

ముందు మాతృభాష, తర్వాత సోదర భాష, ఆ తర్వాతే పరభాష

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి - రాజానగరం(తూర్పుగోదావరి జిల్లా)

అందరూ తెలుగులో మాట్లాడటాన్ని అలవర్చుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని నన్నయ యూనివర్సిటీ ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ కార్యశాల సోమవారం ప్రారంభమైంది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ప్రధాని మోడీతో పాటు దేశంలో ఉన్నత స్థానంలో ఉన్న ఎంతోమంది మాతృభాషలోనే చదువుకున్నారని గుర్తు చేశారు. ముందు మాతృభాష, తరువాత సోదర భాష, అనంతరమే పరభాష అన్నారు. అమ్మ అనే పిలుపులో ఉన్న మాధుర్యం మమ్మీలో ఉండదని, బ్రిటీషు వారి పాలనలో ఇంగ్లీషును దేశప్రజలపై బలవంతంగా రుద్దారని పేర్కొన్నారు. కోర్టులో వాదప్రతివాదాలు, తీర్పులు తెలుగులోనే ఉండాలని, పాలనా వ్యవహారాలు తెలుగులోనే ఉండాలని ఆకాంక్షించారు. మన భాష, మన యాస, మన పాట, మన ఆట, మన గోస కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.


విసి ప్రసన్నశ్రీతో కలిసి జ్యోతిప్రజ్వలను చేసి కార్యశాలను ప్రారంభిస్తున్న మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్యనాయుడు

మూడు పుస్తకాల ఆవిష్కరణ

సైకాలజిస్ట్, రిటైర్డ్ డిఎస్‌పి డాక్టర్ నామగిరి బాబ్జీ రచించిన 'హ్యాండ్ బుక్ ఆఫ్ డ్రగ్ ఎడిక్షన్ అండ్ ది రోల్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్' పుస్తకాన్ని, డాక్టర్ మల్లిభాస్కర్ రచించిన మస్తాన్ బాబు జీవన చిత్రం 'శిఖరాగ్ర మల్లి' పుస్తకాన్ని, నర్సరీ రైతు పుల్లా చినసత్యనారాయణ రచించిన 'ధరణి పుత్రులు' పుస్తకాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ ఎస్.ప్రసన్నశ్రీ, తెలుగు- సంస్కృత అకాడమీ అధ్యక్షులు ఆర్‌డి.విల్సన్ తానా పూర్వాధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్, భారతీయ భాషా సమితి అకడమిక్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.గిరిధరరావు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుపై మచిలీపట్నంలో ఉద్రిక్తత

- బిజెపి వర్సెస్ టిడిపి
- పోటాపోటీగా నినాదాలు
- చక్కదిద్దిన పోలీసులు


యన్‌టిఆర్ విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రతిష్టించేందుకు ప్రయత్నిస్తున్న టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్.

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఉద్రిక్తతకు దారి తీసిన మాజీ ప్రధాని వాజ్ పేయి విగ్రహస్థాపన టిడిపి కూటమి పార్టీల విభేదాలను బహిర్గతం చేసింది. 2014-19 మధ్యకాలంలో హౌసింగ్ బోర్డ్ రింగ్‌లో ఎన్‌టిఆర్ విగ్రహ స్థాపన కోసం తీర్మానించి, మున్సిపల్ రికార్డులలో ఎన్‌టిఆర్ సర్కిల్‌గా నామకరణమైన ప్రదేశంలో రెండు రోజుల క్రితం బిజెపి నేతలు.. వాజ్‌పేయి సర్కిల్ అని నామకరణ చేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వివాదానికి కారణమైంది. సోమవారం అదే రింగ్‌లో వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు బిజెపి నాయకులు శంకుస్థాపన పేరుతో కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం చేపట్టారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ టిడిపి నేతలు రింగ్‌లో కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహాన్ని తీసుకొచ్చి పెట్టేందుకు టిడిపి నేతలు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఇనకుదురుపేట సిఐ పరమేశ్వరరావు, ఆర్‌పేట సిఐ ఏసుబాబు, చిలకలపూడి సిఐ అబ్దుల్ నబీ, ట్రాఫిక్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ పోలీసులు సహకారంతో రెండు గ్రూపులను ఆ ప్రదేశం నుంచి పంపించి సంయమనంతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఒక దశలో రెండు పార్టీల పోటాపోటీ ఆందోళనలతో కూడలిలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసు అధికారులు రెండు పార్టీల నేతలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా, వెనక్కి తగ్గకపోవడంతో హౌసింగ్ బోర్డ్ రింగ్ వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి. గోపాలరావు, శానిటేషన్ విభాగం ఇన్‌ఛార్జి ఆకుల మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సహకరించారు. టిడిపి నేతలు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు వెళ్లిపోయారు. బిజెపి నేతలు ఇంగ్లీష్ చర్చ్ ఎదురు రోడ్లో మకాం వేసి మాజీ ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ నేతృత్వంలో మంతనాలు జరిపారు. టిడిపి నేత మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఇమడా బత్తుల దిలీప్ కుమార్ టిడిపి నాయకులు బత్తిన దాసు, గొర్రెపాటి గోపీచంద్, పిప్పళ్ల వెంకన్న, పివీ ఫణి కుమార్. తదితర కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలో పాల్గొన్నారు.

సంపాదకీయం

గ్యారంటీ లేని 'ఉపాధి'

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (రేగా) వచ్చి ఇరవై ఏళ్లయింది. గ్రామీణ పేద వ్యవసాయ శ్రామికులకు సంవత్సరంలో కనీసం వంద రోజుల పని కల్పనకు గ్యారంటీ చేసిన 'రేగా' స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం తన పదేళ్ల జమానాలో అంతకంతకూ నిర్వీర్యం కావించడం ఆందోళనకర విషయం. పనుల్లేని సమయాల్లో ఉపాధి హామీ ద్వారా కొన్ని రోజుల్లోనైనా పేదల కడుపు నింపుతున్న చట్టానికి తూట్లు పొడిచి వారి పొట్ట కొట్టడం కేంద్ర ప్రభుత్వం మూటగట్టుకున్న దుర్మార్గం. ఉపాధి హామీపై మోడీ సర్కార్ రచిస్తున్న కుట్రలను వామపక్షాలు, ప్రజాసంఘాలు, ఎన్‌జిఒలు, పలు అధ్యయన సంస్థలు, సామాజిక కార్యకర్తలు ఎప్పటికప్పుడు వెలుగులోకితెచ్చి ఎండగడుతున్నా వెనక్కితగ్గేదేలే.. అంటోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో రేగా పరిస్థితి ఎంత అన్యాయంగా ఉందో 'లిబ్‌టెక్' సంస్థ కుండబద్దలు కొట్టింది. ఈ దుస్థితి మన ఒక్క రాష్ట్రానికే కాదు పలు బిజెపి పాలక రాష్ట్రాల్లో కొనసాగుతోంది. దేశంలో 12 కోట్ల మంది పేదలకు జాబ్ కార్డులు జారీ చేయగా వాటిలో యాక్టివ్‌గా ఉన్నవి ఐదున్నర కోట్లు మాత్రమే. ఒక్క ఏడాదిలో జాబ్‌కార్డుల సంఖ్య అమాంతం మూడున్నర కోట్లకు తగ్గిపోయింది. కోట్లలో జాబ్‌కార్డులు తగ్గిపోయాయంటే ఉపాధి హామీ చట్టం అమలు ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఆ ప్రభావం గ్రామీణ పేదల ఉపాధిపై కచ్చితంగా పడుతుంది.

యుపిఎ-1 ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో 2005లో ఈ చట్టం రాగా 2006 సెప్టెంబర్‌లో 200 జిల్లాల్లో ప్రారంభించి 2008 నుంచి అన్ని జిల్లాలకు విస్తరించారు. 2008-09 బడ్జెట్‌లో రేగాకు ఖర్చు చేసింది రూ. 27 వేల కోట్లు. అప్పుడు కేంద్రం మొత్తం వార్షిక బడ్జెట్ రూ.6 లక్షల కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం బడ్జెట్ రూ.50 లక్షల కోట్లు కాగా ఉపాధి హామీకి మోడీ ప్రభుత్వం ప్రతిపాదించింది 86 వేల కోట్లు మాత్రమే. అప్పటికి ఇప్పటికి బడ్జెట్ దాదాపు 8 రెట్లు పెరిగింది. ఆ దామాషాలో ఉపాధి హామీకి కనీసం రెండు లక్షల కోట్లు కేటాయించాలి. కానీ బిజెపి ప్రభుత్వం లక్ష కోట్లు కూడా కేటాయించలేదు. కేటాయించిన నిధులు పాత బకాయిలకు, మెటీరియల్ కాంపొనెంట్‌కు సరిపోతే ఇక కూలీలకు పనులు, వేతనాలు ఎక్కడ? అప్పటికి ఇప్పటికి జనాభా 20-30 కోట్ల వరకు పెరిగింది. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ స్వల్పమేనని తెలుస్తుంది. మోడీ సర్కార్ వల్లించే వికసిత్ భారత్, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, జిడిపి వృద్ధి.. వగైరా వగైరా పేదలనుద్దేశించి కాదు కార్పొరేట్లు, సంపన్నుల కోసమని రూఢి అవుతుంది. కరోనా ఏడాది ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు లక్ష కోట్లకుపైన కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి వ్యయం చేసింది. కరోనా సమస్య వీడినా వ్యవసాయ సంక్షోభం, భారీ యాంత్రీకరణ, అర్బన్‌లో ఉపాధికి ఒత్తిడి వెరసి గ్రామాల్లో ఉపాధి లేక పేదలు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితులు ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెంచుతున్నాయి. ఇదే సమయంలో ఆధార్, ఇకెవైసి వంటి సాంకేతిక కారణాలు చూపి పేదలను 'ఉపాధి'కి దూరం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలు రాష్ట్రంలో ఉపాధి హామీని క్షీణింపజేస్తున్నాయని ఈ కాలంలో పని దినాలు, పనులు చేస్తున్న శ్రామికుల తగ్గుదల తెలుపుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఎనిమిది నెలల్లో ఎస్‌సిలకు కల్పించిన పని దినాలు 5.23 కోట్లు కాగా ఈ సంవత్సరం 3.30 కోట్లకు తగ్గాయి. ఇదే సమయంలో ఎస్‌టిలకు పని దినాలు 3 కోట్ల నుంచి 1.88 కోట్లకు తగ్గాయి. ఎస్‌సిల పని దినాలు 18.7 శాతం, ఎస్‌టిలకు 17 శాతం, మొత్తం పేదలకు 13.6 శాతం తగ్గాయి. పని దినాలు ఆ మేరకు తగ్గితే ఉపాధి పొందే వారి సంఖ్యా తగ్గుతుంది. వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాలను వేళ్లపై లెక్కించొచ్చు. సాంకేతిక కారణాలతో లక్షల్లో జాబ్ కార్డుల తొలగింపు ఉండనే ఉంది. వేతనాల చెల్లింపులకు రాష్ట్రంలో విధించిన ఆంక్షలు కఠినంగా ఉన్నాయి. రోజుకు కనీస వేతనం రూ.320 దక్కాల్సింది అంతకంటే తక్కువ అందుతోంది. వాటి కోసం కొన్ని నెలలు నిరీక్షించాల్సి వస్తోంది. గ్రామీణ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఏడాదిలో 200 రోజుల పనికి గ్యారంటీ, రోజుకు కనీస వేతనం 600 ఇవ్వాలన్న కార్మికుల కోర్కె సహేతుకమైనది. పట్టణ ప్రాంతాలకూ ఉపాధి హామీని విస్తరించాలన్న డిమాండ్ ఆలోచింపదగినది. పేదల కొనుగోలు శక్తి పెంచేందుకు, తద్వారా జిడిపి వృద్ధికి ఉపాధి హామీ వంటివి తోడ్పడతాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులేయడం అవసరం.

మహనీయుల మాట

నేడు డా|| కోట్నీస్ వర్ధంతి




ఏ దేశం వారికైనా ఇల ఒకటే
గగనం ఒకటే
ఏ భాషలు పలికిస్తున్నా
గొంతుల స్వరతంత్రులు ఒకటే
ఆహారం వేరైనా అందరి ఆకలి ఒకటే
ఆకారం వేరైనా ఆధారం బతుకు ఒకటే
నిన్ను నన్ను కన్నప్పుడు
మన తల్లుల నొప్పుల తీరు ఒకటే
ఎన్నో రంగుల తెల్ల కిరణమై వెలుగుతున్న
జీవితం ఒకటే.

జననం : 10.10.1910
మరణం : 9.12.1942

విశ్లేషణ

ఆర్.ఎస్.ఎస్ నిరంకుశత్వ మూలాలు

సవేరా



"మన రాజ్యాంగం వివిధ పశ్చిమ దేశాల రాజ్యాంగాల నుండి వేర్వేరు అంశాలను ఎత్తిరాసుకున్న కంగాళీ రాజ్యాంగం. ఇది ఫక్తు విజాతీయ రాజ్యాంగం. ఇందులో ఒక్క అంశం కూడా మన స్వంతం అని చెప్పకోవడానికి లేదు. మన జాతీయ లక్ష్యం ఏమిటి, జీవితంలో కీలకాంశం ఏమిటి అని ఎక్కడైనా ఒక్క ముక్కయినా ప్రస్తావించారా?" అని గోల్వాల్కర్ తన 'బంచ్ ఆఫ్ థాట్స్' (పాంచజన్యం) పుస్తకంలో ఘాటుగా విమర్శించాడు. మన రాజ్యాంగానికి మనుస్మృతి ఆధారంగా ఉండి ఉండాల్సిందని గోల్వాల్కర్ అభిప్రాయం. మనుస్మృతిలో ఎన్ని అమానవీయ అంశాలున్నాయో అందరికీ తెలుసు. చాతుర్వర్ణ వ్యవస్థను కీర్తిస్తూ శూద్రులను, మహిళలను అణగదొక్కే దుర్మార్గమైన వ్యవస్థకు ప్రతిరూపం మనుధర్మశాస్త్రం. పీడకల వంటి మనధర్మ శాస్త్ర సూత్రాలను ఆచరించడం అంటే మన రాజ్యాంగంలో పొందుపరుచుకున్న ప్రజాస్వామ్యానికి నిలువునా ఉప్పు పాతర వెయ్యడమే.

పదకొండేళ్ల మోడీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదకర స్థాయిలో అడుగంటిపోయింది. ఇది కేవలం ఎన్నికల వ్యవస్థను చెరబట్టడానికే పరిమితం కాలేదు. అన్ని వ్యవస్థల్లో ప్రజాస్వామిక హక్కులను కూల్చేసింది. సమాజం అంచున జీవిస్తున్న వారిని మరింత మూలకు నెట్టివేసింది. రాజ్యాంగ సంస్థలను సంఘీయులు ఆక్రమించుకున్నారు. రాజ్యాంగాన్ని డొల్లగా మార్చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరుస్తున్నారు. విద్వేషపూరిత హిందూత్వ భావజాలంతో సమాజంలో హింసను, అణచివేతను ప్రేరేపిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వం అయినా కార్మికుల కష్టజీవుల అవసరాలను, ఆకాంక్షలను నెరవేర్చాలి. సామాజికంగా అణిచివేతకు గురవుతున్న వారికి ఆలంబనగా నిలవాలి. కానీ బిజెపి ప్రభుత్వ పాలనలో మన దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రతరమయ్యాయి. కష్టజీవులు, పేదలు మరింతగా విస్మరణకు గురవుతున్నారు. అతి కొద్దిమంది కార్పొరేట్ సంస్థల అధిపతులు శతాధిక కోటీశ్వరులై అధికారాన్ని చలాయిస్తున్నారు. ఇదంతా ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? వంటి కీలకమైన ప్రశ్నలకు సమాధానాలు సంక్లిష్టంగా సుదీర్ఘ విశ్లేషణలతో కూడుకుని ఉంటాయి. ప్రధాన కారణం మాత్రం అధికారంలో ఉన్న బిజెపి, దానిని వెనుక నుండి నడిపిస్తున్న ఆర్.ఎస్.ఎస్ సైద్ధాంతిక భావజాలంలో వేళ్లూనుకుని ఉంది. మన ప్రధానమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు అనేక మంది, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు అందరూ ఆర్.ఎస్.ఎస్ ప్రచారక్‌లు, సభ్యులే. వీళ్లందరిలో నరనరాన ఆర్.ఎస్.ఎస్ భావజాలం నిండి ఉన్నది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వీళ్లంతా ఆ భావజాలాన్నే ఆచరణలో పెడుతున్నారు. వాస్తవానికి ప్రజలు ఈ భావజాలానికి ఓటు వేసి అధికారం కట్టబెట్టలేదు. కానీ మన దేశ గతిని ఈ భావజాలమే నిర్దేశిస్తున్నది.

ఫాసిజం నుండి ప్రేరణ

1925లో ఆర్.ఎస్.ఎస్ ఆవిర్భవించిన కాలం నాటి నుండి యూరప్‌లో వెల్లువెత్తిన ఫాసిస్టు భావజాలాన్ని స్ఫూర్తిగా ఎంచుకున్నది. ఈ ప్రభావానికి మూలకారకుడు బి.ఎస్.మూంజీ. 1931 మార్చి నెలలో మూంజీ ఇటలీ నియంత ముస్సోలినీని కలుసుకున్నాడు. రోమ్‌లో నేషనల్ ఫాసిస్టు పార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ సంస్థల పని తీరును దగ్గర నుండి పరిశీలించాడు. ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకుడు కె.బి.హెడ్గేవార్‌కు మూంజీ అత్యంత సన్నిహితుడు, మార్గదర్శి. ఇటలీ ఫాసిస్టులు బైలిల్లా సంస్థ ద్వారా యువతరాన్ని పోగేసి వారికి సైనిక శిక్షణ ఇవ్వడం, యూనిఫారమ్ నిర్దేశించడం వంటి అంశాలతో మూంజీ ప్రభావితం అయ్యాడు. ఇవన్నీ మూంజీ తన డైరీలో రాసుకున్నాడు. ఆ డైరీ ప్రతులు నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీలో ప్రదర్శనకు ఉంచబడ్డాయి. ఈమధ్య ఈ మ్యూజియానికి ఉన్న నెహ్రూ పేరును తొలగించి ప్రధానమంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీగా మార్చింది మోడీ ప్రభుత్వం. 'ఫాసిస్టు భావం ప్రజలను ఐక్యం చేస్తుంది. హిందూ ఇండియాలో కూడా హిందువులను సైనికీకరించడానికి ఇలాంటి సంస్థ అవసరం. డాక్టర్ హెడ్గేవార్ నాయకత్వంలో నాగపూర్‌లో స్థాపించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇలాంటి కోవకు చెందినదే' అని మూంజీ రాశాడని ఇటలీ పరిశోధకుడు మారియా కాసలారీ వెల్లడించాడు.

ఫాసిజం లక్షణాల్లో ఒకటైన యువతను సైనికీకరించడం అన్న భావనకు మూంజీ వాహకంగా మారాడు. ఆర్.ఎస్.ఎస్ సిద్ధాంతకర్త ఎం.ఎస్.గోల్వాల్కర్ అయితే నాజీయిజం పట్ల అమితాసక్తి ప్రదర్శించాడు. 'మనము-మన జాతీయత' అన్న సిద్ధాంత గ్రంథంలో హిట్లర్ యూదులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఘనకార్యంగా కొనియాడాడు. "జర్మన్ జాతి ఔన్నత్యం ఇవాళ చర్చనీయాంశంగా మారింది. జాతి స్వచ్ఛతను, సంస్కృతిని కాపాడుకోవడం కోసం దేశం నుండి పరాయి జాతీయులను-యూదులను-ప్రక్షాళన చెయ్యడం ప్రపంచాన్ని కుదిపేసింది. జాతి గౌరవానికి మించినది వేరేది లేదు అని ఇక్కడ చాటి చెప్పారు. అన్య జాతీయులు, అన్య సంస్కృతులు కలిసి ప్రధాన స్రవంతిలో మూలాలకంటా మిళితం కావడం ఎలా అసాధ్యమో జర్మనీ మనకు రుజువు చేసింది. హిందూస్థాన్ కూడా ఈ పాఠం నేర్చి లబ్ధి పొందాలి" అని గోల్వాల్కర్ సిద్ధాంతీకరించాడు.

గోల్వాల్కర్ రాసిన ఈ పుస్తకం 1939లో ప్రచురించబడింది. 1938 నవంబర్ నాటికే జర్మనీలో యూదుల మీద జాతి హత్యాకాండ మొదలయ్యింది. వందలాది మంది యూదులు హత్యగావించబడ్డారు. 1400 యూదు ప్రార్థనా మందిరాలు (సినగోగ్‌లు), 7000 యూదు దుకాణాలను నాజీ మెరుపు దళాలు జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ దేశాలలో ధ్వంసం చేశాయి. యూదుల మీద నాజీ మూకలు చేసిన ఈ హీనమైన దాడులను జాతి ఔన్నత్యం కోసం తపించిపోతున్న భారత దేశంలోని హిందువులు కూడా ఒక ఉదాహరణగా పరిగణించాలని గోల్వాల్కర్ అభిప్రాయపడ్డాడు. ఫాసిజంలో మరో ప్రధానాంశమైన జాత్యహంకార ధోరణిని అందిపుచ్చుకుని హైందవేతర మతాల పట్ల విద్వేషాన్ని వెళ్ళగక్కాడు.

గోల్వాల్కర్ సిద్ధాంతాన్ని ఆర్.యస్.యస్ ఆవాహన చేసుకున్నది. అన్య మతస్థుల పట్ల ఉన్న ఈ విద్వేష వైఖరినే రాజకీయ వ్యవస్థలో కూడా చొప్పించింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని వారిని వేధించడానికి ఉద్దేశించిన చట్టాలను రూపొందించడంతో పాటు పోలీసు, తదితర వ్యవస్థలను వారి మీదకు ఉసిగొల్పుతున్నది. జాతి ఔన్నత్యం, సైనికతత్వం, మైనార్టీలపై హింసాత్మక దాడులు, మతతత్వ హిందూ రాజ్య స్థాపన-ఇవన్నీ మన దేశ రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజాస్వామ్య స్ఫూర్తికి తీరని విఘాతం కల్పిస్తున్నాయి. మన రాజ్యాంగం పట్ల ఆర్.యస్.యస్ తన వ్యతిరేకతను చారిత్రకంగా బాహాటంగానే చెబుతున్నది.

రాజ్యాంగం పట్ల శత్రుత్వం

1949లో రాజ్యాంగ అసెంబ్లీ మన దేశ రాజ్యాంగాన్ని ఆమోదించిన నాటి నుండి ఆర్.యస్.యస్ దానిని కించపరుస్తూ ప్రచారం కొనసాగిస్తూనే ఉంది. "మన రాజ్యాంగంలో ప్రాచీన భారతదేశంలో ఏనాడో రూపొందించుకున్న రాజ్యాంగ ప్రస్తావనే లేదు. స్పార్టాకు చెందిన వైకుర్గాస్, పర్షియాకు చెందిన సొలోన్‌ల కన్నా ముందుగానే మన భారతదేశంలో మనువు ధర్మాన్ని రూపొందించాడు. ఈ రోజుకీ మనుధర్మ శాస్త్రంలోని సూత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఎంతో భావోద్వేగంతో కొనియాడుతున్నారు. మనుధర్మ సూత్రాల పట్ల విధేయతను పాటిస్తూ ఆచరిస్తున్నారు. కానీ మన రాజ్యాంగ పండితులకు అంతటి ధర్మశాస్త్రం గురించి వీసమెత్తు పట్టింపు లేకపోయింది." అని 1949 నవంబరు 30 'ఆర్గనైజర్' (ఆర్.ఎస్.ఎస్ అధికార పత్రిక) సంపాదకీయం విమర్శించింది.

"మన రాజ్యాంగం వివిధ పశ్చిమ దేశాల రాజ్యాంగాల నుండి వేర్వేరు అంశాలను ఎత్తిరాసుకున్న కంగాళీ రాజ్యాంగం. ఇది ఫక్తు విజాతీయ రాజ్యాంగం. ఇందులో ఒక్క అంశం కూడా మన స్వంతం అని చెప్పకోవడానికి లేదు. మన జాతీయ లక్ష్యం ఏమిటి, జీవితంలో కీలకాంశం ఏమిటి అని ఎక్కడైనా ఒక్క ముక్కయినా ప్రస్తావించారా?" అని గోల్వాల్కర్ తన 'బంచ్ ఆఫ్ థాట్స్' (పాంచజన్యం) పుస్తకంలో ఘాటుగా విమర్శించాడు. మన రాజ్యాంగానికి మనుస్మృతి ఆధారంగా ఉండి ఉండాల్సిందని గోల్వాల్కర్ అభిప్రాయం. మనుస్మృతిలో ఎన్ని అమానవీయ అంశాలున్నాయో అందరికీ తెలుసు. చాతుర్వర్ణ వ్యవస్థను కీర్తిస్తూ శూద్రులను, మహిళలను అణగదొక్కే దుర్మార్గమైన వ్యవస్థకు ప్రతిరూపం మనుధర్మశాస్త్రం. పీడకల వంటి మనధర్మ శాస్త్ర సూత్రాలను ఆచరించడం అంటే మన రాజ్యాంగంలో పొందు పరుచుకున్న ప్రజాస్వామ్యానికి నిలువునా ఉప్పు పాతర వెయ్యడమే.

కేంద్రీకృత ప్రభుత్వం

"అధికారాలు, విధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్యన సమతూకంగా పంపిణీ చేసిన మన రాజ్యాంగ సమాఖ్య వ్యవస్థ ఒట్టి బోగస్. పనికిమాలినది" అని గోల్వాల్కర్ అనేక సందర్భాలలో రాసుకొచ్చాడు. కేంద్రీకృత ప్రభుత్వం, ఏకీకృత పరిపాలన ఉండాల్సిందే అని నొక్కివక్కాణించాడు. రాజ్యాంగానికి తగు సవరణ చేసి ధైర్యంగా కేంద్రీకృత ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యడం ఒక్కటే మార్గం. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే ప్రభుత్వం, ఒకే శాసనాధికారం మన లక్ష్యం కావాలి. పరిపాలనా సౌలభ్యం కోసం దేశాన్ని వివిధ జోన్‌లుగా రూపొందించాలి. కార్యనిర్వాహక అధికారాలను వికేంద్రీకరించవచ్చు కానీ శాసనాధికారం మాత్రం కేంద్రీకృతంగా ఉండాలి. ప్రజాస్వామ్య ఆకాంక్షలు నెరవేర్చడానికి అనేక ప్రాదేశికాలు, ప్రాదేశిక ప్రభుత్వాలు అవసరం. అని కొంత మంది వాదిస్తున్నారు. ఇన్ని శాసన వ్యవస్థలు ఉండటానికి, ప్రజాస్వామ్యానికి ఉన్న సంబంధం ఏమిటో నేను అర్థం చేసుకోలేకపోతున్నా. దేశం యావత్తు ప్రజాస్వామిక ఆకాంక్షలను కేంద్రీకృత శాసన వ్యవస్థ మాత్రమే నెరవేర్చగలదు" అని గోల్వాల్కర్ తన 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో ప్రకటించాడు.

ఏకీకృత ప్రభుత్వం అనేది దేశంలోని ప్రజలంతా ఒక్కటే అన్న జాతీయ భావనను పెంపొందిస్తుందంటాడు గోల్వాల్కర్. "మనది ఒకే దేశం, ఒకే సమాజం, ఒకే జాతి. లౌకిక ఆకాంక్షలు, ఆసక్తులు, జీవిత విలువలు ఒకే రకంగా ఉంటాయి. కాబట్టి సహజంగానే ఏకీకృత ప్రభుత్వం ద్వారా జాతి యావత్తును ఒకే శాసన వ్యవస్థ ద్వారా పరిపాలించడమే సరైనది. ప్రస్తుత ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థ వేర్పాటువాద ధోరణులకు దారితీసే ప్రమాదం ఉన్నది. మనమంతా ఒకే జాతి అన్న భావనను పూర్వపక్షం చేస్తుంది. కాబట్టి ఈ వేర్పాటువాద స్వభావాన్ని రూపుమాపడానికి రాజ్యాంగాన్ని సవరించి కేంద్రీకృత ప్రభుత్వం నెలకొల్పడానికి కృషి చేయాలి" అని గోల్వాల్కర్ మార్గనిర్దేశనం చేశాడు.

పంచాయతీలను ఉదహరిస్తూ మొత్తంగా మన ఎన్నికల వ్యవస్థనే గోల్వాల్కర్ తప్పుపట్టాడు. "ఇవాళా రేపూ పంచాయతీరాజ్ అన్న నినాదం విరివిగా వినబడుతున్నది. కానీ దీనికి మించిన దిక్కుమాలిన వాదన మరొకటి ఉండదు. ఇలాంటి పెడ ధోరణులను అరికట్టాలి. ప్రతి రంగంలో సామాజిక చైతన్యం గల అర్థవంతమైన వ్యక్తులను గుర్తించి, ప్రోత్సహించి దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టమైన, క్రియాశీలమైన ప్రభావం చూపించేందుకు సిద్ధం చెయ్యాలి. ఆ విధంగా పంచాయతీలకు ఏకగ్రీవ ఎన్నికలు జరగాలి. లేకుంటే ఎన్నికలు లేకుండా చెయ్యాలి. ఓటర్ల జాబితా, ఎన్నికల నియమావళిని ఇందుకు అనుగుణంగా మార్చడం ద్వారా పునాది స్థాయిలో ఆరోగ్యకరమైన, ప్రయోజనదాయకమైన నిర్మాణానికి సిద్ధపడాలి. అవసరమైతే రాజ్యాంగాన్ని కూడా ఇందుకు అనుగుణంగా సవరించాలి" అని గోల్వాల్కర్ ప్రతిపాదించాడు.

ఆర్.యస్.యస్ కూడా ఈ విధమైన ఫాసిస్టు తరహా నిర్మాణ రూపాన్నే అనుసరించడం యాదృచ్ఛికం అని భావించలేం. ఆర్.యస్.యస్ అత్యున్నత పదవులైన సర్‌సంఘ్‌చాలక్, ప్రధాన కార్యదర్శి ఏ పదవికీ ఎన్నికలనేవి ఉండవు. అయితే ఆర్.యస్.యస్ ఈ వాదనలను అంగీకరించదు. ప్రతినిధుల సభ కార్యవర్గాన్ని ఎన్నుకుంటుంది అని చెప్పుకొస్తారు. కానీ ఈ ప్రతినిధుల సభ కూడా నామినేట్ అయిన వ్యక్తులతో నిండి ఉంటుంది. పైపెచ్చు ఇవేవీ అసలైన నిర్ణయంలో భాగస్వామిగా ఉండవు.

మోడీ ప్రభుత్వం ఆర్.యస్.యస్ సిద్ధాంతానికి అనుగుణంగా మన దేశాన్ని తీర్చిదిద్దాలని చేస్తున్న ప్రయత్నాలన్నిటినీ ఈ వెలుగులో మనం అర్థం చేసుకోవాలి. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానం ఏకీకృత, కేంద్రీకృత పరిపాలన దిశగా వేస్తున్న తొలి అడుగు. ఒక దేశం ఒకే ఎన్నిక నుండి ఒకే ప్రభుత్వం, ఒకే కేంద్రీకృత శాసన వ్యవస్థ వరకు తీసుకు వస్తారు. ఆ తర్వాత అసలు ఎన్నికలే అవసరం లేదు...అని ఆర్.యస్.యస్ సర్‌సంఘ్ చాలక్‌ను నియమించుకున్నట్లు 'స్వార్థరహిత, త్యాగమూర్తి'గా కీర్తించి ఎవరో ఒకరికి యావత్ అధికారం కట్టబెడతారు. సదరు వ్యక్తి అన్ని వ్యవస్థలను, చివరికి రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహా ఆర్.యస్.యస్ ప్రచారక్‌లు, కార్యకర్తలతో నింపేస్తాడు.

లోపల నుండి తొలిచివెయ్యడం

2014లో కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుండి బిజెపి అత్యంత నిరంకుశంగా మన దేశ ప్రజాస్వామిక నిర్మాణాన్ని ధ్వంసం చేస్తూ పోవడానికి దానిని నడిపించే ఆర్.యస్.యస్ సైద్ధాంతిక భావజాలమే కారణం అని కొత్తగా మనం చెప్పుకోనక్కరలేదు. ఈ క్రమం ఎలా కొనసాగుతుందో సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

లేబర్ కోడ్‌లు, రాష్ట్ర స్థాయి చట్టాల పేరిట కార్మికవర్గ హక్కులను దోచేస్తున్నారు. ప్రభుత్వ విధానాలను గానీ, అధికారపక్ష సభ్యుల అవినీతిని గానీ, పనితీరును గానీ మీడియాగానీ, ఏ సంస్థ అయినాగానీ వ్యక్తులుగానీ విమర్శిస్తే చాలు. వాళ్ళకి బెదిరింపులు, వాళ్ళమీద దాడులు లేదంటే జాతీయ భద్రత చట్టం, 'ఉపా' వంటి క్రూర చట్టాల కింద నిర్బంధంలోకి తీసుకోవడం పరిపాటిగా మారింది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ గొంతు నులిమేస్తున్నారు. దాదాపు 11 రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో బిజెపి పరాజయం పాలయినా, వైరి పక్షాలను చీల్చి బలం కూడగట్టుకుని తిరిగి తనే అధికారం చేపట్టింది. బిజెపి ప్రభుత్వం వివిధ రాష్ట్రాల గవర్నర్లుగా ఆర్.యస్.యస్ వ్యక్తులను నియమించింది. ప్రతిపక్షపాలిత రాష్ట్రాల పనితీరును దెబ్బకొట్టడమే లక్ష్యంగా ఈ గవర్నర్లు పనిచేస్తున్నారు. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర స్వయం ప్రతిపత్తిగల సంస్థలు అధికారపక్షం చెప్పినట్లుగా ప్రతిపక్ష రాజకీయ నాయకుల వేధింపులకు గురిచేసేందుకుగాను...వారి మీది అక్రమ కేసులు బనాయించడం, అరెస్టులుగావించడం పరిపాటిగా మారింది. అవినీతి ఆరోపణలు ఉన్న రాజకీయ నాయకులు బిజెపి తీర్థం పుచ్చుకోగానే వారి మీద కేసులు అటక ఎక్కేస్తున్నాయి. పార్లమెంట్‌లో బిజెపి తనకు ఉన్న మెజార్టీని అడ్డంపెట్టుకొని ప్రతిపక్ష పార్టీలు కీలక సమస్యలను లేవనెత్తకుండా అడ్డుకోవడం, చర్చలకు ఆస్కారం కల్పించకపోవడం, వాయిదా తీర్మానాలు అనుమతించకపోవడం, బిల్లులపై చర్చ లేకుండా ఆమోదింపచేసుకోవడం వంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోంది. ఎన్నికల సంఘం, విజిలెన్స్ కమిషన్, రిజర్వ్‌బ్యాంక్ వంటి స్వయం ప్రతిపత్తిగల సంస్థలను ప్రభుత్వానికి తోక సంస్థలుగా మార్చేసింది. ఆర్.యస్.యస్, బిజెపిలతో అనుబంధం గల వ్యక్తులను ఆయా సంస్థల వివిధ పదవుల్లో నియమించింది.

పెరుగుతున్న ప్రతిఘటన

2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు బిజెపి, ఆర్.యస్.యస్ నిరంకుశ పాలనకు సవాలు విసిరాయి. 2019లో 303 సీట్లు గెలుచుకున్న బిజెపి 240 స్థానాలకు పరిమితం అయ్యింది. అబ్ కీ బార్ చార్ సౌ పార్ (ఈసారి 400 మించి సీట్లు సాధించాలి) అని ఎన్నికల గోదాలోకి దిగిన బిజెపి కి ప్రజలు గట్టి గుణపాఠం నేర్పారు. బిజెపి కి అపరిమిత అధికారం కట్టబెడితే ఈసారి ఏకంగా రాజ్యాంగాన్నే మార్చేస్తుందని సామాన్య జనం కూడా అర్థం చేసుకున్నారు. అందుకే బిజెపి కి సాధారణ మెజార్టీ కూడా రాకుండా నిలవరించారు. రాజ్యాంగం అంటే అంబేద్కర్‌కు ప్రతిరూపంగా భావించే ప్రజలు నిర్ణయాత్మకంగా ఓటు వేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య తత్వాలను నీరుగార్చడానికి బిజెపి/ఆర్.యస్.యస్ లు చేసిన ప్రయత్నాలకు చెంపపెట్టుగా ప్రజలు ఈ తీర్పునిచ్చారు. ఎమర్జెన్సీ ప్రకటించడం ద్వారా 1975-77ల మధ్య రాజ్యాంగం గొంతు నులమడానికి ప్రయత్నించిన నిరంకుశ శక్తులను ప్రజలు చిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పిన అనుభవాన్ని బిజెపి/ఆర్.యస్.యస్ లు గుర్తుంచుకోవడం అవసరం.

('పీపుల్స్ డెమోక్రసీ' సౌజన్యంతో)

వ్యాఖ్య

'ఇండిగో'తో ప్రయాణికుల ఇక్కట్లు




ఆర్. లక్ష్మయ్య

గత కొద్ది రోజులుగా ఇండిగో విమానయాన సంస్థ తన సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులు పడిన అగచాట్లు చూస్తున్నాం. తాజాగా ప్రభుత్వ సంస్థ అయిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) కొంత వెనకడుగు (నాటకీయంగా) వేసినట్లు వార్తలు వస్తున్నాయి. అసలు ఇలా ఎందుకు జరిగింది? వివరాలు తెలుసుకుందాం!

అంతర్జాతీయంగా విమాన పైలట్లు, సిబ్బంది పని గంటలు, విరామం తదితర నిబంధనలకు భిన్నంగా భారతదేశంలో అమలు జరుగుతున్నాయి. విమాన పైలట్లపై ఒత్తిడి తగ్గించడం ద్వారా భద్రతను మెరుగుదల చేయాలని విమాన పైలట్ల అసోసియేషన్లు గత కొన్ని సంవత్సరాలుగా డిజిసిఎ తోను విమానయాన సంస్థలతోనూ విజ్ఞప్తులు, రాయబారాలు నడిపాయి. చివరకు డిజిసిఎ విమాన పైలట్ల పని గంటల తగ్గింపు తదితర అంశాలపై ఒక ముసాయిదా విధానాన్ని రూపొందించింది. దాన్ని విమానయాన సంస్థలన్నింటికీ పంపి తన వెబ్‌సైట్‌లో కూడా వివరాలు అప్‌లోడ్ చేసింది. చివరిగా 2024 మే నెలలో తుది నియమ, నిబంధనలను ఖరారు చేసి విడుదల చేసింది. 2025 డిసెంబర్ నుండి వాటిని అమలు చేయాలని అన్ని విమానయాన సంస్థలను ఆదేశించింది. అయితే ఇండిగో విమానయాన సంస్థ డిజిసిఎ ఆదేశాలను నిర్లక్ష్యంగా, అహంభావ ధోరణితో పక్కన పెట్టింది. కొత్త నిబంధనల ప్రకారం వేలాది సిబ్బంది నియామకం జరగాలి. అప్పటికి ఇండిగోలో పైలట్ల కొరత ఉన్నది. దేశంలో పైలట్లకు కొరత లేదు. పెద్ద సంఖ్యలో పైలట్లు నిరుద్యోగులుగా ఉన్నారు. పైలట్ల సిబ్బంది విషయాలు పట్ల, విమాన నిర్వహణ పట్ల పైలట్ల అసోసియేషన్‌తో గాని రోస్టరింగ్ స్టాఫ్‌తో కానీ ఇండిగో యాజమాన్యం కనీసం సంప్రదించలేదు.

ఇండిగో సంస్థ 420 విమానాలతో భారతదేశంలో అతిపెద్ద విమానయాన సంస్థగా, ప్రపంచంలో ఎనిమిదవ పెద్ద సంస్థగా ఎదిగింది. విమానయాన రంగంలో 20 బిలియన్ డాలర్ల వాటా కలిగి ఉంది. కింగ్ ఫిషర్, జెట్ ఎయిర్ వేస్, గో ఎయిర్ లాంటి సంస్థలు దివాలా తీయడం, స్పైస్ జెట్ విమానాల సంఖ్య100 నుంచి 20కి పడిపోవటం వంటివన్నీ ఇండిగో తన ఆధిపత్యాన్ని పెంచుకోవడానికి దోహద పడ్డాయి. వీటన్నిటి ఫలితంగా కొన్ని సంవత్సరాలుగా ఇండిగో యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా, అహంభావ పూరితంగా వ్యవహరిస్తున్నది. భారీ విమాన ప్రమాదాలు జరగకపోయినప్పటికీ ఈపాటికే పలు ఫిర్యాదులు ఉన్నాయి.

డిజిసిఎ ఆదేశాలు అమలు చేయడానికి భారీ సంఖ్యలో విమాన పైలట్ల కొత్త నియామకాలు జరగాలి. అందుకు చాలా సమయం పడుతుంది. నియామకాలు జరిగిన తర్వాత వారందరికీ కనీసం మూడు నెలలపాటు డిజిసిఎ నిబంధనల అమలుకు అవసరమైన శిక్షణనివ్వాల్సి ఉంటుంది. అలాగే విమాన పైలట్లు, ఇతర సిబ్బంది పని గంటలకు సంబంధించి



మార్పులు సాఫ్ట్‌వేర్‌లో చేయాలి. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ప్రపంచస్థాయి కొన్ని సంస్థలు మాత్రమే ఈ షెడ్యూలింగ్ చేయగలుగుతాయి. వాటికి విమానయాన సంస్థలు తమ విమానాల సంఖ్య, ఒక్కో విమానం రోజుకు ఎన్ని షెడ్యూళ్లు తిరుగుతుంది? పైలట్లు, ఇతర సిబ్బంది ఎంతమంది ఉన్నారు? వారి అనుభవాలు తదితర వివరాలన్నిటిని ఆ సంస్థలకు అందజేయాలి. అప్పుడే సక్రమమైన షెడ్యూలింగ్ సాధ్యమవుతుంది. ఇవన్నీ భారీ ఖర్చుతో కూడినవి. అందుచేత ఉద్దేశపూర్వకంగానే ఇండిగో సంస్థ డిజిసిఎ ఆదేశాలను బేఖాతరు చేసింది. తనకు గల పలుకుబడి, ఆధిపత్యం చూసుకొని తనను డిజిసిఎ ఏమీ చేయలేదు అనే అహంభావంతో ఇండిగో వ్యవహరించింది.

డిజిసిఎ తన ఆదేశాలను వెనక్కి తీసుకుంటుందనే దృఢ నమ్మకంతో యాజమాన్యం ఉంది. కానీ 'డామిట్ కథ అడ్డం తిరిగింది' అన్నట్లు డిజిసిఎ తన ఆదేశాలను ముందుగా నిర్దేశించిన తేదీ నుండి అమలుకు పూనుకున్నది. దానికి ఎలాంటి సన్నాహాలు చేయని ఇండిగో సంస్థ తన విమాన సర్వీసులను భారీగా రద్దు చేయాల్సి వచ్చింది (మొదటిరోజు 200, రెండవ రోజు 500, మూడో రోజు వెయ్యి విమానాలు రద్దు చేసింది). ఇదే అదనుగా మిగిలిన విమానయాన సంస్థలు ప్రయాణ చార్జీలను 10 నుంచి 15-20 రెట్లు పెంచేశాయి. ప్రయాణికులను దిమ్మ తిరిగేటట్లుగా బాదాయి. ప్రైవేటీకరణ దుష్ఫలితాలు ఎలా ఉంటాయో మరొకసారి రుజువయ్యింది. వెరసి ప్రయాణికులు బలిపశువులు అయ్యారు.

చివరకు డిజిసిఎ తాత్కాలికంగా కొంత వెనకడుగు వేసింది. తన ఆదేశాల అమలు తేదీని 2026 ఫిబ్రవరి 10 వరకు పొడిగించింది. అయితే సుమారు 15 నెలల గడువులో భారీ నియామకాలు తదితర ఏర్పాట్లు చేయని ఇండిగో సంస్థ కేవలం రెండు నెలలలో డిజిసిఎ ఆదేశాలను ఎలా అమలు చేస్తుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. 2024 మే నెల నుంచి 2025 డిసెంబరు దాకా తన ఆదేశాల అమలుకు అవసరమైన సన్నాహాలు విమానయాన సంస్థలు, ముఖ్యంగా ఇండిగో తీసుకుంటున్నదీ లేనిది డిజిసిఎ పర్యవేక్షణ చేసిన దాఖలాలు లేవు. చేస్తే ఇలాంటి పరిస్థితి దాపురించేది కాదు. ఈ మొత్తం ఎపిసోడ్‌ను పరిశీలించినప్పుడు కేంద్ర ప్రభుత్వం, పౌర విమానయాన శాఖ మంత్రిత్వ శాఖ ఘోరంగా విఫలమయ్యాయని అర్థమవుతున్నది. దీనికి కేంద్ర ప్రభుత్వం, ఇండిగో సంస్థ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. 2026 ఫిబ్రవరి నాటికి పూర్తి స్థాయిలో నిబంధనలు అమలు చేయడానికి గ్యారెంటీ ఇవ్వాలి. లేదా మేము ఆదేశాలు ఇస్తాం, మీరు వాటిని ఉల్లంఘిస్తూ ఉండండి, మరల పొడిగిస్తూ ఉంటాం అని లోపాయికారిగా కేంద్ర ప్రభుత్వం (డిజిసిఎ), ఇండిగో సంస్థ ఒక అంగీకారానికి వచ్చాయా? ఇది వెండితెర మీద చూడాల్సిన సినిమా మాత్రమే. ఏ రంగంలోనైనా ప్రైవేట్ వారి గుత్తాధిపత్యం ఉంటే పరిస్థితులు ఇలానే ఉంటాయని ఏవియేషన్ రంగ నిపుణులు, 'ఎయిర్ దక్కన్' వ్యవస్థాపకులు అయిన కెప్టెన్ గోపీనాథ్ 'ది వైర్' కరణ్ థాపర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

ప్రపంచంలో అనేక దేశాలలో విమానయాన సంస్థలు ప్రభుత్వ సంస్థలుగా లేదా అత్యధిక వాటాలు కలిగిన సంస్థలుగా ఉన్నాయి. కానీ, మన దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటు యాజమాన్యానికి మోడీ ప్రభుత్వం అప్పగించింది.

/వ్యాసకర్త అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఎ.ఐ.ఆర్.టి.డబ్ల్యు.ఎఫ్) ఉపాధ్యక్షులు /

క్రిప్టో కేసుల్లో రూ.4,189కోట్ల ఆస్తులు జప్తు

న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ చట్టం కింద నమోదైన క్రిప్టో కేసుల్లో రూ.4,189.89కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసిందని సోమవారం పార్లమెంట్‌కు ప్రభుత్వం తెలియచేసింది. ఇందుకు సంబంధించి 29మందిని అరెస్టు చేసింది, పరారీలో వున్న ఒక ఆర్థిక నేరస్తుడుని (ఎఫ్ఇఓ)గా ప్రకటించింది.




వేదికపై గవర్నర్, కైలాస్ సత్యార్థి, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి తదితరులు

నిర్దేశిత లక్ష్యాలతో తెలంగాణ అభివృద్ధి

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- 30దేశాల నుంచి ప్రతినిధులు హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌ను ఆ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం ప్రారంభించారు. స్థానిక యువతకు ఉపాధి, పెట్టుబడుల ఆకర్షించడంతో పాటు భవిష్యత్ ప్రణాళికలు నిర్దేశించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ సమిట్‌కు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ...నిర్దేశిత లక్ష్యాలు నిర్దేశించుకుని తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్తోందన్నారు. 2047లోగా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలన్నదే లక్ష్యమని చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన నోబెల్ బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని అన్నారు. 20 లక్షల మంది రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని, మహిళలకు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించిందని తెలిపారు. 2047లోగా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలు, అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా విభజించుకుని చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తిగా ముందుకెళ్తున్నామని తెలిపారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ మాకు ఆదర్శమని అన్నారు. అభివృద్ధి, పెట్టుబడుల విషయంలో బెంగళూరుతో హైదరాబాద్ నగరం పోటీపడుతోందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ అన్నారు. ఈ రెండు మహానగరాలు ప్రపంచంతో పోటీపడుతున్నాయని తెలిపారు. గ్లోబల్ సమిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, సినీ నటులు నాగార్జున, పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



తొలి బుల్లెట్ ట్రైన్ నిర్మాణ పనులు వేగవంతం

- అహ్మదాబాద్ - ముంబయి మధ్య 2027 నాటికి ట్రయల్ రన్
- హై స్పీడ్ రైలు చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ అగర్వాల్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అహ్మదాబాద్

భారత్‌లో తొలి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అహ్మదాబాద్ - ముంబయి మధ్య చేపట్టిన ఈ ప్రాజెక్టు విలువ రూ.1.8 లక్షల కోట్లు. దేశంలో ఇదే మొదటి బుల్లెట్ రైలు. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు నడవనుంది. ఈ వ్యయంలో జపాన్ ప్రభుత్వం 81 శాతం రుణంగా ఇస్తోంది. మిగతా వ్యయం మహారాష్ట్ర - గుజరాత్ రాష్ట్రాలు భరించాలి. 2020-21లో పనులు ప్రారంభమయ్యాయి. 508 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గం ఇప్పటికి 360 కిలోమీటర్లలో పనులు వేగంగా సాగుతున్నట్లు హై స్పీడ్ రైలు చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ అగర్వాల్ తెలిపారు. సూరత్ - బీమోరీ మధ్య 50 కిలోమీటర్ల పరిధిలో 2027లో ట్రయల్ రన్ చేస్తామని తెలిపారు. అహ్మదాబాద్ స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. బుల్లెట్ ట్రైన్ ప్రారంభంలో సబర్మతి మల్టీ హబ్‌ను రూ.320 కోట్లతో చేపట్టామన్నారు. ఇది మెట్రో, బుల్లెట్ ట్రైన్ అని, సాధారణ రైల్వే ప్రయాణికులకు అన్ని రకాలుగా ఉపయోగం ఉంటుందని అన్నారు. ఈ రైలు వల్ల అహ్మదాబాద్-ముంబయి మధ్య ఆర్థికంగానూ, వ్యాపారపరంగానూ అభివృద్ధి జరుగుతుందన్నారు.

రూపాయికి గడ్డుకాలమే..!

- యుఎస్‌తో ఒప్పందం జరగకపోతే కష్టమే

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ రికార్డ్ కనిష్టాలను చవి చూస్తోండగా.. ఈ పరిస్థితి మరింత కాలం కొనసాగ వచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తోన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారు కాకపోతే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90 దిగువకు రాకపోవచ్చని హెచ్చరిస్తున్నారు. పెరుగుతోన్న వాణిజ్య లోటు, విదేశీ పెట్టుబడులు తగ్గడం కారణంగా రూపాయిపై ఒత్తిడి పెరుగుతోం దని విశ్లేసిస్తున్నారు. ఇప్పటికే డిసెంబర్ 3న రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 90కి పడిపోయి రికార్డు కనిష్ట స్థాయిని నమోదు చేసింది.. దీంతో ఆసియాలో అత్యంత పేలవమైన పనితీరు కనబరిచిన కరెన్సీగా నిలిచింది. యుఎస్-ఇండియా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో రూపాయి దిగజారిన పరిస్థితిని చూశామని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ పేర్కొన్నారు. రూపాయి స్వల్పకాలంలో అస్థిరంగా ఉండవచ్చని, రెండువైపులా హెచ్చుతగ్గులు ఉంటాయని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రిన్సిపల్ ఎకనామిస్ట్ సాక్షి గుప్తా తెలిపారు. డిసెంబర్ నెలాఖరులోగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు చోటు చేసుకుంటే రూపా యికి తాత్కాలిక మద్దతు లభించే అవకాశం ఉందని ఆమె అభిప్రాయ పడ్డారు.

ఎపి బ్రాండ్ పునరుద్ధరించాం

(మొదటిపేజీ తరువాయి)

మధుమేహ వ్యాధి వస్తుందన్నారు. ప్రజల వినియోగానికి అనుగుణంగా పంటల మార్పిడి చేయాలన్నారు. ప్రజలు తినే పంటను పండించకపోతే అమ్ముడుపోవని, ప్రభుత్వం కొనుగోలు చేసి ఏం చేస్తుందని వ్యాఖ్యానించారు. ఉద్యాన, ఆక్వా కల్చర్ రంగాలను కూడా మరింతగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సమీకృత వ్యవసాయం ఇప్పుడు కీలకమైన అంశంగా మారింద న్నారు. బిల్‌గేట్స్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలో అగ్రిటెక్ అమలు చేస్తున్నామని చెప్పారు.

ఇండిగో సమస్య కేంద్ర ప్రభుత్వ పరిధి

ఇండిగో విమానయాన సంస్థ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చూసుకుంటోందని, దీనిని తాను సూపర్‌వైజ్ చేయడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. విమానయానశాఖ మంత్రి తమ పార్టీ ఎంపి అయినా పార్లమెంట్‌కు, ప్రధాన మంత్రికి జవాబుదారీగా ఉంటారని చెప్పారు. కేంద్ర మంత్రి పనితీరు ప్రధాన మంత్రి పరిధిలో ఉంటుందని, తాను జోక్యం చేసుకోలేనని చెప్పారు. తన మంత్రివర్గానికి తాను బాధ్యుడిగా ఉంటానని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలను ఇండిగో పాటించలేకపోయిం దన్నారు. ఇండిగో సమస్య టిడిపి ఎంపి వల్లే వచ్చిందని వైసిపి చేస్తున్న ఆరోపణలు ఎలా చూస్తారని విలేకరులు.. చంద్రబాబును ప్రశ్నించగా.. వైసిపి తలా తోకలేని పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి అంశంలోనూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ నుంచి మద్యం సేవిస్తూ వచ్చి ప్రమాదంలో పాస్టర్ మరణించిన ఘటనను కూడా హత్య కింద చిత్రీకరించే ప్రయత్నం చేశారని తెలిపారు.

థాయ్, కంబోడియా ఘర్షణల్లో ఐదుగురు మృతి

బ్యాంకాక్ : థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య సోమవారం జరిగిన ఘర్షణల్లో థాయ్ సైనికుడు, నలుగురు కంబోడియా పౌరులు మరణించారు. ఎనిమిదిమంది థాయ్ సైనికులు గాయపడ్డారు. సరిహద్దుల్లో 35 వేలమందిని ఖాళీ చేయించారు.

ఇండిగో సంక్షోభంపై సంస్థాగత విచారణ

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ : ఇండిగో విమాన ప్రయాణ సంక్షోభంపై సంస్థాగత విచారణ చేపట్టాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో లేదా జాయింట్ పార్లమెంటరీ కమిటీ ద్వారా స్వతంత్ర దర్యాప్తును తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేసింది. దేశంలోని విమాన ప్రయాణికులను పూర్తిగా విస్మరించడంపై పొలిట్‌బ్యూరో ఈ ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశీయ విమానయాన రంగంలో గుత్తాధిపత్యం కారణంగానే ప్రస్తుత సంక్షోభం ఏర్పడిందని తెలిపింది. కోర్టు ఆదేశాల తరువాతే విమాన పైలట్లు, సిబ్బంది రక్షణను నిర్ధారించడానికి, విమాన ప్రయాణికుల భద్రతపై ఆందోళనలను పరిష్కరించడానికి ఉద్దేశించిన నూతన నిబంధనలను డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ప్రవేశపెట్టిందని, దీనికి



తగినంత సమయం ఉన్నప్పటికీ ఇండిగో తగిన సన్నాహాలు చేసుకోలేదని విమర్శించింది. తద్వారా ఇండిగో కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా నిబంధనల అమలును వాయిదా వేయాలని డిజిసిఎను ఇండిగో బలవంతం చేసిందని, తద్వారా భద్రత విషయంలో తీవ్రంగా రాజీ పడ్డారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. మరోవైపు ఇండిగో విమానాల ఆకస్మిక రద్దుతో ఇతర విమానయాన సంస్థలు భారీ లాభాలను ఆర్జించడానికి సిద్ధం అయ్యాయని, కనీసం అత్యవసర పరిస్థితులకు కూడా విమాన ప్రయాణం అందకుండా పోయిందని తెలిపింది. ప్రస్తుతం ఏర్పడిన సంక్షోభం గతకొన్నేళ్లుగా విమానయాన రంగంలో ఏర్పడిన నిర్మాణాత్మక లోపానికి నిదర్శనమని, ఈ సంక్షోభం గుత్తాధిపత్యం, ఆశ్రిత పక్షపాతాలను ఎదుర్కొంటున్న ఇతర కీలక రంగాలకు ముందస్తు హెచ్చరిక అని విమర్శించింది. అంతేకాకుండా ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపికి ఇండిగో భారీగా విరాళాలు ఇచ్చిందనే వార్తలు కూడా ఇదే సమయంలో వస్తున్నాయని, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో లేదా జాయింట్ పార్లమెంటరీ కమిటీ ద్వారా స్వతంత్ర దర్యాప్తును తక్షణమే ప్రారంభించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. విమాన ఛార్జీల ధరలు తగ్గించాలని విజ్ఞప్తి చేసింది.

ఆంధ్ర జట్టుకు నిరాశ

విదర్భ చేతిలో 19 పరుగుల తేడాతో ఓటమి

లక్నో: సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆంధ్ర జట్టు వరుస విజయాలకు బ్రేక్ పడింది. సోమవారం జరిగిన ఎలైట్ గ్రూప్-ఎలో ఆంధ్రప్రదేశ్ జట్టు 19పరుగుల తేడాతో విదర్భ చేతిలో ఓటమిపాలైంది. టాస్ గెలిచిన ఆంధ్ర కెప్టెన్ రికీ బుయ్ బౌలింగ్ ఎంచుకోగా.. విదర్భ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. అమన్ మోఖాడే(50) అర్ధసెంచరీకి తోడు అక్షయ్ వాడ్కర్(41) బ్యాటింగ్‌లో రాణించారు. ఆంధ్ర బౌలర్లు సత్యనారాయణ రాజుకు నాలుగు, త్రిపురాన విజయ్, స్టీఫెన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 9వికెట్లు కోల్పోయి 135 పరుగులే చేసింది. అవినాశ్(44)కి తోడు కెప్టెన్ రికీ బుయ్(26), శశికాంత్(19) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. విదర్భ బౌలర్లు యశ్ ఠాకూర్‌కు నాలుగు, ఉమేశ్ యాదవ్, హర్ష్ దూబేకు రెండేసి వికెట్లు దక్కాయి. దీంతో గ్రూప్-ఎలో ఆంధ్ర జట్టు 7మ్యాచ్‌లు ముగిసేసరికి 5విజయాలు, 2ఓటములతో సహా 20పాయింట్లతో 2వ స్థానంలో ఉంది. ఈ గ్రూప్‌లో ఉన్న ముంబయి జట్టు 24పాయింట్లతో టాప్‌లో కొనసాగుతోంది.

న్యూయార్క్‌లోని వలసదారులకు అండగా నిలబడతాం

- నగర మేయర్ మమ్దానీ ప్రతిజ్ఞ

వాషింగ్టన్ (అమెరికా) : న్యూయార్క్ నగరంలోని 30 లక్షలకు పైగా వలసదారులకు అండగా నిలబడతామని ఆ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ ప్రతిజ్ఞ చేశారు. అలాగే అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) ఏజెంట్ల ఆదేశాలను పాటించడానికి లేదా వారితో మాట్లాడటానికి నిరాకరించే హక్కు వలసదారులకు ఉందని మమ్దానీ తెలిపారు. జడ్జి సంతకంతో కూడిన అధికారిక న్యాయ వారెంట్ లేకుండా నివాసాలు, పాఠశాలలు, కార్యాలయాలు, ప్రైవేటు ప్రాంతాల్లోకి ఐసిఇ ఏజెంట్లు ప్రవేశించలేరని మమ్దానీ స్పష్టం చేశారు. ఈ మేరకు మమ్దానీ సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్టు చేశారు. ఐసిఇకి తలుపులు మూసి ఉంచాలని పిలుపునిచ్చారు. 'మీ హక్కులు మీకు తెలిస్తే మనమందరం ఐసిఇకి వ్యతిరేకంగా నిలబడగలం' అని వలసదారుల నుద్దేశించి అన్నారు. అలాగే, గత వారాంతంలో కెనాల్ స్ట్రీట్‌లో ప్రదర్శనకారులపై ఐసిఇ ఏజెంట్లు చేసిన దాడి గురించి కూడా మమ్దానీ ప్రస్తావించారు.

జెలెన్‌స్కీ శాంతి ప్రణాళికను అంగీకరించడం లేదు : ట్రంప్

- ముగిసిన అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య చర్చలు

వాషింగ్టన్ : ఉక్రెయిన్ యుద్ధ నివారణ కోసం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక ప్రస్తుతానికి అటకెక్కినట్లే కన్పిస్తోంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి ముగింపు పలకడానికి తాను చేసిన ప్రతిపాదనను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా చదవకపోవడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శాంతి ప్రణాళిక అమలు విషయంలో ముందుకు సాగడానికి జెలెన్‌స్కీ సిద్ధంగా లేరని వ్యాఖ్యానించారు. ఫ్లోరిడాలో అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య మూడు రోజుల పాటు జరిగిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకుండానే ముగిశాయి. ఉక్రెయిన్ ప్రతినిధులు తన ప్రతిపాదనపై సానుకూలంగానే స్పందించారని, జెలెన్‌స్కీ ఇంకా సమీక్షించలేదని ట్రంప్ విలేకరులకు తెలిపారు.

ఫిడే క్యాండిడేట్ టోర్నీకి ప్రజ్ఞానంద అర్హత



చెన్నై: భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద మరో ఫీట్‌ను అందుకున్నాడు. వచ్చే ఏడాది జరిగే ఫిడే క్యాండిడేట్ టోర్నమెంట్‌కు అర్హత సాధించాడు. సోమవారం జరిగిన ఫిడే సర్క్యూట్-2025లో పాల్గొన్న ప్రజ్ఞానంద స్టెఫాన్ అవగ్యాన్ మెమోరియల్ 12వ సింక్‌ఫీల్డ్ కప్‌లో 2వ స్థానంలో నిలిచాడు. దీంతో 2026లో జరిగే క్యాండిడేట్ టోర్నీకి బెర్త్ కొట్టాడు. భారత్‌నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మాత్రమే. దీంతో ఈ టోర్నీలో ఆడే ఎనిమిదిమంది గ్రాండ్‌మాస్టర్లలో ఏడుగురి స్థానాలు భర్తీ అయ్యాయి. వీరిలో ప్రజ్ఞానందతోపాటు అనీష్ గిరి, ఫాబియానో కరువానా, మాథియాస్ బ్లూబామ్, జావోఖిర్ సింధారోవ్, వీ యు మరియు ఆండ్రీ ఎసిపెంకో ఉన్నారు. ఇక చెన్నైకి చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ చెస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చే గ్రాండ్‌మాస్టర్లలో ఒకనిగా రికార్డులు నెలకొల్పుతున్నాడు. టాటా స్టీల్ మాస్టర్స్, సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ రొమేనియా, ఉజ్‌చెస్ కప్ మాస్టర్స్, లండన్ చెస్ క్లాసిక్ ఓపెన్ టైటిళ్లను ప్రజ్ఞానంద గెలుచుకున్నాడు.

టీమిండియాకు జరిమానా

- మ్యాచ్ ఫీజులో 10శాతం కోత

దుబాయ్: వన్డే సిరీస్ నెగ్గిన టీమిండియాకు ఐసిసి ఝలక్ ఇచ్చింది. రాయ్‌పూర్ వన్డేలో నిర్ణీత సమయంలోపు ఓవర్లు పూర్తి చేయనందుకు భారత క్రికెటర్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని సోమవారం ఐసిసి వెల్లడించింది. రాయ్‌పూర్ వన్డేలో దక్షిణాఫ్రికాకు 359 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా నిర్దేశించగా.. ఆ లక్ష్యాన్ని సఫారీ జట్టు మరో నాలుగు బంతులు ఛేదించింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా 2 ఓవర్లు వెనకబడింది. ఈ విషయాన్ని గుర్తించిన రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఐసిసి నిబంధనల్లోని ఆర్టికల్ 2.22 ప్రకారం స్లో ఓవర్ రేటుకు జట్టు సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇదే విషయమై విచారణ సందర్భంగా కెప్టెన్ కేఎల్ రాహుల్ తన పొరపాటును అంగీకరించాడు. టీమిండియా ఆటగాళ్లకు ఫైన్ విధించాలనే నిర్ణయాన్ని ఆన్ ఫీల్డ్ అంపైర్లు రాడ్ టక్కర్, రోహన్ పండిట్.. థర్డ్ అంపైర్ సామ్ నొగజ్స్కీ, ఫోర్త్ అంపైర్ జయరామన్ మదన్‌గోపాల్ ఆమోదించారు.




భారత మహిళల హాకీ జట్టుకు ఊరట

- ప్లే-ఆఫ్స్‌లో వేల్స్‌పై 3-1గోల్స్‌తో గెలుపు
- నేడు క్రాస్ ఓవర్‌లో ఉరుగ్వేతో ఢీ

శాంటియాగో(చిలీ): భారత మహిళల జూనియర్ హాకీ జట్టు ప్లే-ఆఫ్స్‌కు అర్హత సాధించింది. సోమవారం జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో భారత జట్టు 3-1గోల్స్ తేడాతో వేల్స్‌ను చిత్తుచేసింది. భారత్ తరఫున హినా బానో(14వ ని.), సోనెలిటా (24వ ని.), ఇషికా(31వ ని.)లో ఒక్కో గోల్స్ చేయగా.. వేల్స్ తరఫున ఏకైక గోల్స్‌ను ఎలొసీ(52వ ని.) కొట్టింది. దూకుడుగా ఆడిన భారత జట్టు మ్యాచ్ ప్రారంభమైన 30 సెకన్లలోనే తొలి పెనాల్టీ కార్నర్‌ను సంపాదించింది. కానీ ఆ పెనాల్టీని గోల్‌గా మలచడంలో విఫలమైంది. భారత గోల్‌కీపర్ నిధి ఐర్లాండ్ మిడ్‌ఫీల్డర్ కొట్టిన బంతిని అద్భుతంగా అడ్డుకొని ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపింది. దీంతో తొలి క్వార్టర్ ముగిసేసరికి భారతజట్టు ఒక గోల్ కొట్టి 1-0 ఆధిక్యతలో నిలిచింది. నేడు జరిగే క్రాస్ ఓవర్ మ్యాచ్‌లో భారత జట్టు ఉరుగ్వేతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 9వ స్థానానికి పోటీపడనుంది.

విఎన్‌వికె శాస్త్రి కన్నుమూత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



దశాబ్దాలపాటు గిరిజన తెగల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలందించిన డాక్టర్ విఎన్‌వికె శాస్త్రి (78) సోమవారం మరణించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని మెహిదీపట్నం టోలిచౌకిలో తన నివాసంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారులు అరుణ్, కశ్యప్ ఉన్నారు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి పక్కన కొవ్వూరు. గిరిజన సంక్షేమ శాఖలో 36 ఏండ్లు వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు. గిరిజనుల స్థితిగతులపై అనేక పుస్తకాలు రాశారు. 1975 నుంచి ఆదిలాబాద్, భద్రాచలం, ఏటూరునాగారం, మన్ననూర్, శ్రీకాకుళం, ఉట్నూర్ ఐటిడిఎలలో అధికారిగా పనిచేశారు. గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి కోసం విశేష కృషి చేశారు. 1990లో గిరిజన సంక్షేమ శాఖ సాంస్కృతిక, అధ్యయన సంస్థ డైరెక్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. దశాబ్దాలపాటు గిరిజనుల కోసం పనిచేస్తూ వారి జీవన విధానం, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో లోతైన అధ్యయనం చేశారు. గొప్ప సామాజికవేత్తగా గుర్తింపు పొందారు. గోండులు, కోలాం, కోయ, చెంచు, లంబాడి గిరిజనుల చరిత్రపై అనేక వ్యాసాలు, పుస్తకాలు రాసి గిరిజనుల్లో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేశారు.

ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటు

- విఎన్‌వికె శాస్త్రి మృతి పట్ల సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విఎన్‌వికె శాస్త్రి మృతి ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం తెలపడంతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన సమస్యలపై 10 రకాల పుస్తకాలు శాస్త్రి ప్రచురించారని, 100 రకాల వ్యాసాలు రాశారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో గిరిజన పరిశోధనా సంస్థలో డైరెక్టర్‌గానూ, ఏటూరి నగర్ ప్రాజెక్టు అధికారిగానూ అనేక బాధ్యతల్లో పనిచేసి గిరిజన ప్రజలకు సేవ చేశారని కొనియాడారు. మరణించే వరకు గిరిజనుల కోసం, గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు, గిరిజనుల విద్య, వైద్యం, తదితర సమస్యలపై అహర్నిశలూ కృషి చేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు.

ప్రణాళిక లేకే ఇండిగో సంక్షోభం

- రెవెన్యూపై తీవ్ర ఒత్తిడి మూడీస్ వెల్లడి
- ఏడో రోజూ 562 విమానాలు రద్దు
- హైదరాబాద్ నుంచి 110 పైగానే క్యాన్సిల్



ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల కష్టాలు

న్యూఢిల్లీ : బడ్జెట్ ఎయిర్‌లైన్స్ ఇండిగోలో సంక్షోభం కొనసాగుతోంది. వరుసగా ఏడో రోజూ వందల విమానాలు రద్దయ్యాయి. ప్రయాణికులు పడిగాపులు తప్పలేదు. మరోవైపు కేంద్రం ఆదేశాలతో ఇండిగో రిఫండ్‌ల వేగాన్ని పెంచింది. ఇండిగోకు ప్రణాళిక లేకపోవడం ద్వారానే సంక్షోభంలోకి జారుకుందని.. ఇది స్వయంకృతాపరాదమేనని అంతర్జాతీయ రేటింగ్ ఎజెన్సీ మూడీస్ విమర్శించింది. ఇండిగో సంక్షోభం సోమవారానికి ఏడో రోజుకు చేరుకోగా, ఢిల్లీ, బెంగళూరు సహా ఆరు మెట్రో విమానాశ్రయాల్లో మొత్తంగా 562 విమానాలు రద్దయ్యాయని అధికారులు తెలిపారు. ఢిల్లీ విమానాశ్రయంలో మొత్తంగా 134 విమానాలు రద్దు కాగా, వీటిలో 75 వెళ్లాల్సినవి కాగా, 59 రావాల్సినవి. మరోవైపు బెంగళూరు విమానాశ్రయంలో 150వరకు సర్వీసులు రద్దయ్యాయి. వీటిలో 76 రావాల్సిన విమానాలు కాగా, 74 వెళ్ళాల్సినవి. సోమవారం నడపాల్సిన 2300 విమానాల్లో ఇప్పటికే 562 రద్దు కాగా, మిగిలిన వాటిపై ఇతర ఎయిర్‌పోర్టుల నుండి ఇంకా సమాచారం అందాల్సి వుంది. కేంద్ర పౌర విమానయాన శాఖ అంచనా వేసిన దానికన్నా ఈ మార్పులు ఇంకా ఎక్కువగానే వుండే అవకాశం వుంది. దాదాపు 90 దేశీయ విమానాశ్రయాలు, 40కి పైగా అంతర్జాతీయ విమానాశ్రయాల నుండి ఇండిగో విమానాలు నడుపుతోంది. ముంబయి, హైదరాబాద్ విమానాశ్రయాల్లో వరుసగా 98, 112 విమానాలు రద్దు చేశారు. కోల్‌కతాలో కేవలం రెండు మాత్రమే రద్దు కాగా, చెన్నై 56 విమానాలు నిలిచిపోయాయి. వందలాది విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. తమ విమానాలు రద్దు అవుతున్నాయని సోషల్ మీడియాలో అనేక మంది ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ఇండిగో ఇప్పుడు "ఇండిగో లేట్'గా మారిపోయిందని సెటైర్లు వేస్తోన్నారు. ప్రయాణికులకు ఇప్పటి వరకు రూ.827 కోట్ల వరకు రిఫండ్లు ప్రాసెస్ చేసినట్టు ఇండిగో ప్రకటించింది. డిసెంబర్ 15 వరకు క్యాన్సిల్ అయిన టికెట్లకు ఎలాంటి చార్జీ లేకుండా ఫుల్ రిఫండ్ ఇస్తామని హామీ ఇచ్చింది. మరోవైపు వేలాది సూట్‌కేసులు ఎయిర్‌పోర్టుల్లోనే పడి ఉన్నాయి. మిగిలిన బ్యాగేజీని 48 గంటల్లో డెలివరీ చేస్తామని పేర్కొంది. ఈ సంక్షోభంపై ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్‌కు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నోటీసులు జారీ చేసింది. 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు ప్రయాణికులకు రెండో సారి ఆ కంపెనీ సిఇఒ పీటర్ క్షమాపణలు చెప్పారు. డిసెంబర్ 15వరకు సేవల్లో స్థిరత్వం వస్తోందని.. 2026 ఫిబ్రవరి వరకు పూర్తి రికవరీ జరగొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం విమానాల రద్దు సంఖ్య తగ్గిందని.. నిర్వహించే వాటిని షెడ్యూల్ ప్రకారం ఆపరేట్ అవుతాయని హామీ ఇచ్చారు.

రుణ పరపతికి దెబ్బ : మూడీస్

కొత్త విమానయాన నిబంధనలపై ఇండిగో సమర్థంగా ప్రణాళికలు వేయలేకపోవడమే ఈ సంక్షోభానికి కారణమని ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ మూడీస్ తెలిపింది. ఇండిగోకు సర్వీసులు భారీగా రద్దు కావడం ఆ కంపెనీ రుణ పరపతిని దెబ్బతీయనున్నాయని.. ఆ సంస్థకు 'క్రెడిట్ నెగెటివ్'ను ఇస్తోన్నట్లు పేర్కొంది.

రాష్ట్రాలకు సెస్ పంపిణీ ఫార్ములా తీసుకురావాలి

- రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ డిమాండ్
- ఆరోగ్య భద్రత జాతీయ భద్రతా పన్ను బిల్లు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రాలకు సెస్‌ను పంపిణీ చేయడానికి ఫార్ములా తీసుకురావాలని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ డిమాండ్ చేశారు. రాజ్యసభలో ది హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ (పాన్ మసాలా తయారీ యూనిట్లపై పన్ను పెంపు) బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'సెస్'ను రాష్ట్రాలతో పంచుకుంటామని హామీ ఇచ్చారని, ఎలా పంచుకోవాలనే అంశంపై నిర్దిష్టమైన వివరాలేవీ లేవని అన్నారు. కేంద్రం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల మధ్య స్పష్టమైన 'విశ్వాస లోటు' ఉందని బ్రిట్టాస్ అన్నారు. కేంద్రం ఈ వసూలను రాష్ట్రాలకు ఎలా పంపిణీ చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. బిల్లు నుండి వచ్చే సెస్‌లో జాతీయ భద్రతకు, రాష్ట్రాలకు ఎంతెంత వెళ్తుందో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య ప్రయోజనాల కోసమే సెస్ వినియోగించాలని నిర్ధారించలేదు : ఎన్‌సిపి

బిల్లు నిర్మాణం, దాని చిక్కుల గురించి ఎన్‌సిపి ఎంపి ఫౌజియా ఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. వసూలు చేసిన సెస్ విభజించబడదని, అమలు ఖర్చు పరంగా ఎక్కువ భారాన్ని మోస్తున్న రాష్ట్రాలు ప్రతికూలతలో ఉన్నాయని ఆమె అన్నారు. ఈ బిల్లు ఆరోగ్య సెస్‌ను సృష్టిస్తుందని, కానీ ఆ సెస్ ఆరోగ్య ప్రయోజనాల కోసం ఉపయోగించబడుతుందని నిర్ధారించలేదని ఆమె అన్నారు.

స్పష్టమైన నిబంధనలు ఉండాలి : సిపిఐ ఎంపి

రాష్ట్రాలకు నిధులు సమకూర్చడంపై స్పష్టమైన నిబంధనలు ఉండాలని సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. 'ఒకవైపు కేరళ వంటి రాష్ట్రాలకు బహుళ, ఏకకాల షాక్‌లు, మరోవైపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఆర్థిక కేంద్రీకరణ' అని మోదీ ప్రభుత్వ నినాదానికి ఆరోగ్య భద్రత జాతీయ భద్రతా సెస్ బిల్లు అద్దం పడుతుందని ఆయన అన్నారు. ఆరోగ్యం రాష్ట్ర పరిధిలోని అంశం, కేంద్రం నిధులను రాష్ట్రాలతో ఎలా పంచుకుంటుందో బిల్లుకు స్పష్టమైన నిబంధనలు అవసరమని అన్నారు. శివసేన ఎంపి ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ.. బిల్లు కింద వసూలు చేసే సెస్ రాష్ట్రాలకు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన సెస్ మొత్తాన్ని లేదా శాతాన్ని కేంద్రం బిల్లులో పేర్కొనలేదని అన్నారు. ప్రజా ఆరోగ్యం, జాతీయ భద్రతకు సంబంధించిన ఈ బిల్లు ద్రవ్య బిల్లు ఎలా అవుతుంది? బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాల్సిన అవసరం ఉందని బిజెడి ఎంపి సులతా డియో అన్నారు. దీనికి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ జోక్యం చేసుకుని ఏ బిల్లులు ద్రవ్య బిల్లులు, ఏవి కావో స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. దేశంలో కేంద్రం సెస్ వసూలు పెరుగుతూనే ఉందని, కానీ రాష్ట్రాలకు ఏమీ అందడం లేదని ఆమె అన్నారు. చర్చ అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం ఇచ్చారు. జాతీయ భద్రత, ప్రజారోగ్యంపై వ్యయాన్ని పెంచడానికి పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధించాలని కోరుతూ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. ఈ బిల్లును రాజ్యసభ.. లోక్‌సభకు తిరిగి పంపింది.

జైహింద్ కంటే తక్కువ కాదు

- వందేమాతరంపై చర్చలో సిపిఎం ఎంపి ఎస్. వెంకటేశన్ ప్రసంగం



సిపిఎం ఎంపి వెంకటేశన్

న్యూఢిల్లీ : వందేమాతరంపై చర్చ సందర్భంగా సిపిఎం ఎంపి ఎస్ వెంకటేశన్ సోమవారం పార్లమెంట్‌లో ప్రసంగించారు. వందేమాతరం అనే నినాదం భారత స్వాతంత్ర్య పోరాటానికి ఆత్మ అన్నది నిజమని, కానీ ఇది కేవలం ఈ ఒక్క నినాదం కాదని తెలిపారు. జై హింద్ నినాదం కంటే వందేమాతరం నినాదం తక్కువ కాదని, జై హింద్ నినాదం ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం కంటే కొంచెం కూడా తక్కువ కాదని తెలిపారు. 'వందేమాతరం గీతం గురించి రాజ్యాంగ సభ చాలా వివరంగా చర్చించి, కేవలం రెండు చరణాలను మాత్రమే తీసుకొని, నాలుగు చరణాలను వదిలివేసి ఒక నిర్ణయానికి వచ్చింది. ఇదంతా జరిగిన తర్వాత, ఈ పాట 150వ వార్షికోత్సవం సందర్భంగా పాలక పార్టీ ఈ పాట గురించి చర్చించాలనుకుంది' అని వెంకటేశన్ అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రతి నినాదం వెనుక లక్షలాది మంది ప్రజలు ర్యాలీ అయ్యారని, కానీ మీరు ఏ నినాదం వెనుక ర్యాలీ చేశారని ప్రధాని మోడీ, బిజెపి నాయకులను ఎంపి ప్రశ్నించారు. 'పైగా ఈ నినాదాలన్నీ ఎవరికి వ్యతిరేకంగా లేవనెత్తారో వారి వెనుక మీరు ఉన్నారు. మీరు తప్పించుకోవడంలో విఫలమై స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నప్పటికీ, 'నేను పొరపాటున పాల్గొన్నాను' అని క్షమాపణ లేఖ రాసి మీరు బయటకు వచ్చారు' అని విమర్శించారు. 'ఈ నినాదాలను మోసిన వారందరూ, రాసిన వారందరూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. కానీ, మీరు దీనికి విరుద్ధంగా ఉండి, ఈ రోజు దీనిపై చర్చించాలని చెబుతున్నప్పటికీ, మీ రాజకీయ విధిగా ఈ దేశం ముందు దాని గురించి చర్చించాల్సిన సమయం ఆసన్నమైందని నేను ఇక్కడ ఎత్తి చూపాలనుకుంటున్నాను' అని ఎంపి తెలిపారు. 'ఈ దేశం యొక్క బహుత్వవాదం కారణం గానే 'ఈశ్వర్ అల్లా తేరే నామ్' నినాదం 'వందేమాతరం' కంటే ఎక్కువగా ఉంది. మీరు ఎప్పుడైనా మీ పెదవులపై 'ఈశ్వర్ అల్లా తేరే నామ్' అని పలికారా.. కానీ మీరు ఈ రోజు ఏమి చేస్తున్నారు? మీ రాష్ట్ర ప్రభుత్వాలు సర్క్యులర్లు పంపుతున్నాయి. మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం వందేమాతరం పాటలోని ఆరు చరణాలను పాడాలని సర్క్యులర్ పంపుతోంది. ఇక్కడ మనం ప్రశ్న అడగాలనుకుంటున్నాము: తదుపరి వ్యక్తి ఏ పాట పాడాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను మీకు ఎవరు ఇచ్చారు?' అని ఎంపి వెంకటేశన్ ప్రశ్నించారు. 'మానని గాయాలను నయం చేయాలి. కానీ గాయాలను రేకెత్తించడం ద్వారా మాత్రమే మీరు లాభం పొందుతారు కాబట్టి, మీరు గాయాలను రేకెత్తిస్తూనే ఉంటారు' అని తెలిపారు.

కొత్త పార్లమెంట్ భవనం, చిహ్నాలు

ఈ కొత్త పార్లమెంట్ భవనం లోపల మీకు 12 విగ్రహాలు ఉన్నాయి. అవి ఎవరి విగ్రహాలు అని మీకు తెలుసా? మీకు ఒక్క క్రైస్తవ విగ్రహం కూడా కనిపించలేదా? పవిత్ర ఖురాన్ యొక్క ఒక్క చిహ్నాన్ని కూడా మీరు కనుగొనలేదా? అని ఎంపి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ దేశం యొక్క బహుళత్వం ఈ సభలో కూడా ప్రతిబింబించకూడదని భావించే మీరు, దేశభక్తి గురించి మాకు ఉపన్యాసాలు ఇస్తున్నారని విమర్శించారు. 'ప్రజలకు భక్తి అవసరం.మీకు శత్రుత్వం అవసరం.అందరికీ ఆధ్యాత్మికత అవసరం.కానీ మీకు అల్లర్లు అవసరం' అని బిజెపి తీరును విమర్శించారు.

బెంగాల్ ఎన్నికల కోసమే కొత్త స్టంట్ : ప్రియాంక గాంధీ

దేశంలో ఎన్నికల సంస్కరణలపై చర్చ జరగకుండా దృష్టి మరల్చడానికే కేంద్రప్రభుత్వం వందేమాతరంపై చర్చ పేరుతో కొత్త కార్యక్రమం ప్రారంభించిందని ప్రియాంక గాంధీ విమర్శించారు. బెంగాల్‌లో త్వరలో జరగనున్న ఎన్నికల కోసమే కేంద్రప్రభుత్వం ఈ కొత్త స్టంట్ మొదలు పెట్టిందని అన్నారు. వందేమాతరంపై చర్చ పేరుతో దేశం కోసం పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బిజెపి ఎప్పుడూ ప్రజలకు గతమే చూపిస్తుందని, భవిష్యత్తును ఆ పార్టీ చూడదని, ప్రజలను చూడనివ్వదని తీవ్రంగా విమర్శించారు. 'మాజీ ప్రధాని నెహ్రూ ఆనాడు ఇస్రోను ప్రారంభించకపోతే మంగళయాన్ యాత్ర జరిగేదా?, ఎయిమ్స్‌ను ఏర్పాటు చేయకపోతే కరోనా వైరస్‌ను ధీటుగా ఎదుర్కొనే వాళ్లమా?' అని ప్రియాంక ప్రశ్నించారు.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని వాళ్లు ఈనాడు మాట్లాడుతున్నారు : అఖిలేష్ యాదవ్

ఆనాడు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనని వాళ్లు ఇప్పుడు వందేమాతరం గురించి, ఆ గీతం విలువల గురించి మాట్లాడుతున్నారని ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్ విమర్శించారు. వందేమాతరంపై చర్చలో ఆయన మాట్లాడుతూ, వందేమాతరం జాతీయ గేయమని, ఆ గేయాన్ని ఒకరి నమ్మకాలను ఇతరులపై రుద్దే సాధనంగా వినియోగించడం సరికాదని అన్నారు. కొన్ని విచ్ఛిన్నకర శక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం వందేమాతరం గీతాన్ని వాడుకుంటున్నాయని బిజెపిపై విమర్శలు చేశారు. "వందేమాతరం ప్రజలను ఏకం చేసింది" అని అన్నారు.

ప్రత్యేక ప్రాముఖ్యత కలిగిన గేయం : డిఎంకె ఎంపి రాజా

వందేమాతరంపై చర్చ సందర్భంగా డిఎంకె ఎంపి ఎ.రాజా మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నడూ జరగని ఒక విచిత్రమైన, విభిన్నమైన సందర్భాన్ని సభ చూస్తోందని అన్నారు. రాజకీయ రంగుతో సంబంధం లేకుండా, వందేమాతరం పాట వినిపించినప్పుడు, అందరూ నిలబడి గౌరవం ఇచ్చి మనం ఐక్యతతో వున్నామని చూపించేవారని తెలిపారు.

ఎపి బ్రాండ్ పునరుద్ధరించాం

(మొదటిపేజీ తరువాయి)

సమాధానంగా చెప్పారు. విమానయానశాఖ మంత్రి తమ పార్టీ ఎంపి అయినా పార్లమెంట్‌కు, ప్రధాన మంత్రికి జవాబుదారీగా ఉంటారని చెప్పారు. కేంద్ర మంత్రి పనితీరు ప్రధాన మంత్రి పరిధిలో ఉంటుందని, తాను జోక్యం చేసుకోలేనని చెప్పారు. తన మంత్రివర్గానికి తాను బాధ్యుడిగా ఉంటానని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలను ఇండిగో పాటించలేకపోయిందన్నారు. ఇండిగో సమస్య టిడిపి ఎంపి వల్లే వచ్చిందని వైసిపి చేస్తున్న ఆరోపణలు ఎలా చూస్తారని విలేకరులు.. చంద్రబాబును ప్రశ్నించగా.. వైసిపి తలా తోకలేని పార్టీ అని ఆయన విమర్శించారు. ప్రతి అంశంలోనూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ నుంచి మద్యం సేవిస్తూ వచ్చి ప్రమాదంలో పాస్టర్ మరణించిన ఘటనను కూడా హత్య కింద చిత్రీకరించే ప్రయత్నం చేశారని తెలిపారు.

పెంచలయ్య కుటుంబానికి సాయం చేస్తాం

నెల్లూరు జిల్లాలో గంజాయి మూకల చేతుల్లో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబానికి సాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. పెంచలయ్య హత్యకు నిరసనగా అన్ని రాజకీయ పార్టీలు బంద్ నిర్వహించాయని, కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందిస్తారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు పరిశీలించి సాయం చేస్తామని చంద్రబాబు చెప్పారు. నెల్లూరు జిల్లాలో లేడీ డాన్లు పెరిగారని, గంజాయి అమ్మించడంతో పాటు హత్యలు చేయిస్తున్నారని అన్నారు.

కబుర్లు ఎక్కువ... కార్యాచరణ తక్కువ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చింది 1.2 బిలియన్ డాలర్లేనని రాఘవులు తెలిపారు. 2024 నుంచి 2029 నాటికి 500 బిలియన్ డాలర్లు వస్తాయన్న ప్రచారం 'హెచ్చులు' మాత్రమేనని అన్నారు. 20 ఏళ్ల క్రితం రైతుల నుంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో అదానికి 2,800 ఎకరాలు, కాకినాడలో సెజ్‌లకు పది వేల ఎకరాలు, అనంతపురంలో లేపాక్షికి ఎనిమిది వేల ఎకరాలు, ప్రకాశం జిల్లా వినుకొండలో 30 వేల ఎకరాలు ఇచ్చారని, ఆ భూములన్నింటినీ పెట్టుబడిదారులు వారి లాభాపేక్షకే ఉపయోగించుకున్నారని, పరిశ్రమలు రాలేదని వివరించారు.

గూగుల్‌కు కారు చౌకగా విద్యుత్, నీరు ఎందుకివ్వాలి?

డేటా సెంటర్లు అవసరమేగాని అందులో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవని రాఘవులు తెలిపారు. గూగుల్‌కు చౌకగా నీరు, విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. నిజంగా ఉపాధి కల్పించాలనుకుంటే ఎన్నో మార్గాలు ఉన్నాయని తెలిపారు. ఉపాధి సృష్టించగల ఫుట్‌వేర్, గార్మెంట్, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఉన్నాయని, ఆయా రంగాల్లో పరిశ్రమలు పెట్టవచ్చని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సేకరించిన భూముల్లో పరిశ్రమలు పెట్టడంపై దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎపి విభజన జరిగి తెలంగాణ వేరయ్యాక అక్కడ కూడా అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. ఈ కాలంలో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, యుపి దేశంలో ముందుకెళ్తున్నాయి కానీ, ఎక్కువ కాలం చంద్రబాబు సిఎంగా ఉన్న ఉమ్మడి ఎపి, తాజా ఎపిలో కబుర్లు తప్ప ఆచరణ లేదన్నారు.

'ఉక్కు' ఉద్యోగుల జీతాల్లో కోతకే ఉత్పత్తితో లింకు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఇంకా దిగజార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కుట్రలు పన్నుతున్నాయని రాఘవులు అన్నారు. ఉత్పత్తితో లింకు పెట్టి కార్మికుల జీతాల్లో కోత విధిస్తున్నారని, కార్మికులను ఉక్కు పరిశ్రమ నుంచి తరలిపోయేలా కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటుందని చెబుతూనే ప్లాంట్‌కు నాసిరకం రా మెటీరియల్, పెల్లెట్స్ సరఫరా చేస్తున్నారని, సరిగా ఉత్పత్తి చేయడం లేదని కార్మికులపై నిందలు మోపడం సరికాదని అన్నారు. ఉక్కు కార్మికులను నైతికంగా దెబ్బతీసే కుట్రలను యాజమాన్యం కొనసాగిస్తూ నాలుగు నెలల జీతాలు రూ.400 కోట్లను బకాయి పెట్టిందని తెలిపారు. ఇలా పొగపెట్టి పొమ్మనేలా చేస్తే సహించేది లేదన్నారు. నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని హితవు పలికారు. పోరాటాలతో ఉక్కును కాపాడుకుంటామన్నారు.

ప్రభుత్వ నియంత్రణలోనే కీలక రంగాలు

దేశంలోని కీలక రంగాల్లో ప్రభుత్వ నియంత్రణ ఉండాలని బివి రాఘవులు అన్నారు. ప్రైవేట్ వాళ్లకు వదిలేస్తే విమానయాన రంగంలా కకావికలం అవుతుందని తెలిపారు. ఇండిగో సమస్య పాలకవర్గ విధానాల వల్ల వచ్చిన సంక్షోభమని వివరించారు. కేంద్రం రెండేళ్ల క్రితమే పైలట్‌లు ఎలా ఉండాలో నిబంధనలు జారీ చేసిందని, సదరు సంస్థ అమలు చేయలేదని అన్నారు. అయినా, కేంద్రం తగిన రీతిలో స్పందించలేదని తెలిపారు. ప్రైవేట్ విమానయాన సంస్థతో సర్కారు కుమ్మక్కయిందా? అని ప్రశ్నించారు. ఇదే అదునుగా టాటా చేతిలోని ఎయిర్ ఇండియా టికెట్ల ధరలను వేల నుంచి రూ.లక్షలకు పెంచేసిందన్నారు. ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖలో సిఐటియు జాతీయ మహాసభ జరగబోతోందని, ఆ పనుల్లో భాగస్వామ్యం అయ్యేందుకు తాను విశాఖ విచ్చేశానని తెలిపారు. అనంతరం మహాసభ జరగబోయే ఎయు కన్వెన్షన్ సెంటర్‌ను రాఘవులు సందర్శించారు.

జపాన్ తీరంలో భూకంపం

టోక్యో : జపాన్ ఉత్తర తీరంలో 7.6 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. దీంతో సునామీ హెచ్చరికలను జారీ చేశారు. జపాన్ కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 11:15 గంటలకు ఈ భూకంపం సంభవించింది. హొక్కైడో ద్వీపానికి, అమోరి ప్రాంతానికి సమీపంలో సముద్ర ఉపరితలం నుంచి దాదాపు 50 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు జపాన్ వాతావరణ కేంద్రం తెలిపింది. శక్తిమంతమైన ప్రకంపనల కారణంగా అమోరి, హొక్కైడో, ఐవాటే, బ్లూమ్‌బెర్గ్ ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. భూకంపం ప్రభావంతో ఈ తీరాల్లో 3 మీటర్ల వరకు అలలు విరుచుకుపడుతున్న అధికారులు వెల్లడించారు.

నష్టాన్ని అంచనా వేసేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని సనాయె తకాయిచి మీడియాకు వెల్లడించారు. ప్రజల ప్రాణాలు కాపాడటమే తమకు ప్రాధాన్యమని పేర్కొన్నారు. విపత్తు ధాటికి హచినో హే పట్టణంలోని ఓ హోటల్‌లో పలువురు గాయపడినట్లు సమాచారం. మరోవైపు భూకంప ప్రభావితప్రాంతంలోని అణు విద్యుత్ కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది.





JEEVANA జీవన the family

పులిపిల్ల!



ఒక అడవిలో అన్ని రకాల జంతువులూ ఉండేవి. ఆ అడవికి రాజు పులి. ఒకసారి పిల్లి, పులిపిల్లకు 'చెట్టు ఎక్కడం నేర్పిస్తాను' అంది. దాంతో పులిపిల్ల, పిల్లితో స్నేహం చేసింది. కొన్ని రోజుల్లో పులిపిల్ల చెట్లు ఎక్కడం నేర్చుకుంది కానీ దిగడం వచ్చేది కాదు. దిగడానికి అంజి అనే కోతి సహాయపడేది. ఒక రోజు 'అమ్మా! నువ్వు ఎలుకతో ఎందుకు స్నేహం చేస్తున్నావు' అంది పులిపిల్ల. 'ఒక సారి నేను వలలో చిక్కుకుంటే ఆ ఎలుకనే తన నేస్తాలతో వచ్చి నన్ను కాపాడింది' అంది పులి. 'ఎప్పుడో జరిగిందానికి ఎలుకతో అంత స్నేహం అవసరం లేదు' అని అంది పులిపిల్ల. బిడ్డ మాటలకు పులి నవ్వుకుంది.

ఒక రోజు పులిపిల్ల, పిల్లితో ఆటలాడుతూ వేటగాడు వేసిన వలలో చిక్కుకుంది. 'నన్ను కాపాడు నేస్తం' అని పిల్లిని వేడుకుంది పులిపిల్ల. 'అయ్యో! వలను కొరకడం నాకు రాదు' అంది పిల్లి. పులిపిల్ల వలలో చిక్కుకున్నది చూసిన కోతి 'అయ్యో! వలను కొరకడం ఎలుకకు తప్ప ఎవరికీ రాదు. నీకేమో ఎలుక అంటే గిట్టదు ఇప్పుడెలాగా?' అని అంది. 'అయ్యో! కోతి బావా.. ఎలాగైనా ఎలుకను పిలిచి నన్ను విడిపించవా?' అని కన్నీరు పెట్టుకుంది పులిపిల్ల.

కోతి వెళ్ళి ఎలుకకు చెప్పగానే ఎలుక తన సైన్యంతో వెళ్ళి పులిపిల్ల చిక్కుకున్న వలను నాలుగు వైపులా కొరికింది. పులిపిల్ల సురక్షితంగా బయటపడింది. తనకి సహాయం చేసిన ఎలుకలకు పులిపిల్ల కృతజ్ఞతలు చెప్పింది. తల్లి పులి దగ్గరకి చేరుకుని 'అమ్మా!.. ఈ రోజు నన్ను ఎలుకలు కాపాడాయి. ఇప్పుడు నాకు వాటి విలువ తెలిసింది. ఇంకెప్పుడూ నేను ఎవరినీ చులకన చేయను. నిన్ను తప్పుగా అర్థం చేసుకున్నందుకు నన్ను క్షమించు. ఇక నుండి అందరితోనూ స్నేహంగా ఉంటాను' అని చెప్పింది.

- యు.విజయశేఖర రెడ్డి, హైదరాబాద్.

moon	j	o	w	t	r	a
boat	m	c	d	q	c	r
crab	o	r	e	b	l	i
deer	o	a	e	o	o	a
cloud	n	b	r	a	u	h
chair	s	v	o	t	d	c

గజిబిజి

పిల్లలూ, ఇక్కడ ఉన్న ఆంగ్ల అక్షరాలు పక్కనే ఉన్న బాక్సులో గజిబిజిగా ఉన్నాయి. అవి ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ




చిలుకోటి ఆనంద్‌రెడ్డి,
5వ తరగతి,
శ్రీ చైతన్య సిబిఎస్ఇ, సిద్ధిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అలవాటు పడితే... అంతా అస్తవ్యస్తం!

సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఎన్నో రుగ్మతలు సామాజికంగా ఆర్థికంగా మనపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అయితే వాటితో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఏకైక రుగ్మత మాదకద్రవ్యాల వినియోగం. మద్యం, పొగాకు ఉత్పత్తులకి లైసెన్సులు ఇచ్చి ప్రోత్సహించే ప్రభుత్వాల ఉదాసీన వైఖరి ప్రస్తుతం దేశంలో డ్రగ్స్ వాడకాన్ని, వ్యాపారాన్ని కూడా పెంచిపోషిస్తోంది. డ్రగ్స్‌కి అలవాటు పడిన వారు చేసే విపరీతాలకి నేడు సమాజం భారీ మూల్యం చెల్లించుకుంటోంది. తమని తాము నాశనం చేసుకోవడంతో ప్రారంభమయ్యే ఈ వ్యసనం, మొదట కుటుంబాన్ని, తరువాత సమాజాన్ని, చివరికి దేశాన్ని నాశనం చేస్తోంది. డ్రగ్స్ వ్యసనానికి అలవాటు పడుతున్న వారిలో కలిగే శారీరక, మానసిక రుగ్మతలు, అన్ని వయసుల వారు వినియోగించేంత సులభంగా తయారవుతున్న దీని రూపాలు తెలుసుకుని జాగ్రత్తపడడం ఇప్పుడు మనముందు ఉన్న తక్షణ కర్తవ్యం.



'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ చీఫ్స్ ఆఫ్ పోలీస్' మాదకద్రవ్యాలని ప్రధానంగా ఏడు రూపాలుగా చెప్పింది. సిఎన్ఎస్ డిప్రెస్సంట్లు, సిఎన్ఎస్ స్టిమ్యులంట్లు, హాలుక్యినోజన్‌లు, డిస్‌అస్సోసియేటివ్ అనస్థెటిక్స్, నార్కోటిక్ అనాల్జెసిక్స్, ఇన్‌హేలంట్స్ రూపాల్లో ఉన్న డ్రగ్స్ శరీర అవయవాలపై వివిధ రూపాల్లో దాడి చేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

- సిఎన్ఎస్ డిప్రెస్సంట్లు మెదడు, శరీరం పని తీరుని మందగించేలా చేస్తాయి.
- సిఎన్ఎస్ స్టిమ్యులంట్లు గుండె కొట్టుకునే వేగాన్ని పెంచి రక్తపోటు పెరిగేలా చేస్తాయి. లేదా శరీరానికి ఉద్రేకాన్ని కలిగిస్తాయి. కొకైన్, ఆంఫెటామైన్లను, మేథాఫెటామైన్లు కూడా ఈ జాబితాలో ఉంటాయి.
- హాలుక్యినోజెన్‌లు వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఆలోచించేలా ప్రేరేపిస్తాయి. దీని తీవ్ర రూపం అంటే డెలీరియం దశకి చేరుకున్న తరువాత రాత్రికి, పగలకి కూడా తేడా తెలియదు.
- డిస్‌అస్సోసియేటివ్ అనస్థెటిక్స్, నార్కోటిక్ అనాల్జెసిక్స్ వాడకం వల్ల నొప్పి తెలియకుండా చేస్తాయి. భావోద్వేగాల నియంత్రణ చేసుకోలేరు. ఓపియం (నల్ల మందు), కొకైన్, హెరాయిన్, డెమెరాల్,డార్వోన్, మార్ఫిన్, మేథాడోన్, వికోడిన్, ఆక్సీకోట్టిన్ డ్రగ్స్ ఈ తరహావి.

వివిధ రూపాల్లో..

సాధారణంగా సిగరెట్లతో పాటు తీసుకునే కొకైన్, గంజాయి, కూల్‌డ్రింక్స్‌తో కలిపి తీసుకునే టాబ్లెట్లు, ద్రవ రూపంలో దొరికే ఎల్ఎస్‌డీ (లైసెర్జిక్ యాసిడ్ డైథ్లమైడ్) ట్యాబ్లెట్లని ఉద్రేకాలని పెంచేందుకు వినియోగిస్తుంటారు. ఇక పార్టీలప్పుడు ఎండిఎంఎ మిథలీన్ డైఆక్సీ మేథామ్ఫెటామైన్‌ని వాడతారు.

మాదకద్రవ్యాలు ఆరోగ్యాన్ని ఎలా దెబ్బతీస్తున్నాయో అనే విషయంపై ప్రముఖ వైద్య నిపుణులు ప్రస్తావించిన, హెచ్చరించిన అంశాలని ప్రముఖ వార్తా పత్రికలు కొంతకాలంగా ప్రచురిస్తున్నాయి.

- గంజాయిని హషీష్, చరస్, హై-పొటెన్సీ వీడ్ వంటి రూపాల్లో విక్రయిస్తున్నారు. వీటి వాడకం వల్ల జ్ఞాపకశక్తి తగ్గడం, చురుకుదనం తగ్గిపోవడం, ఆందోళన, భయం పెరగడం, దీర్ఘకాలంలో మెదడు పనితీరు పూర్తిగా నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. వాస్తవానికి, కల్పితాలకి మధ్య తేడా గుర్తించలేకపోవడం పెరుగుతుందని కూడా ప్రస్తావించారు. గంజాయి వాడకం ప్రస్తుతం 15-20 ఏళ్లల్లోనే విస్తరిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సింథటిక్ డ్రగ్స్ : ఈ రూపాన్ని తాజాగా అత్యంత ప్రమాదకరమైనదిగా గుర్తించారు. ఇవి రసాయనిక పద్ధతుల్లో తయారవుతాయి, ప్రభావం అధికంగా ప్రమాదం తీవ్రంగా ఉంటుంది.

ఎండిఎంఎ, మెఫెడ్రోన్, ఫెంటనిల్, క్రిస్టల్ మెథ్ (ఐస్), కీటామైన్, సింథటిక్ కాథినోన్స్ రూపంలో లభించే వీటిని వాడడం వల్ల గుండెపోటు ప్రమాదం, శరీర ఉష్ణోగ్రత 41 డిగ్రీ సెల్సియస్ నుండి 42 డిగ్రీ సెల్సియస్‌కి పెరగడం, మెదడు పనితీరు తక్షణ ధ్వంసం, నరాల వ్యవస్థపై శాశ్వత నష్టం కలుగుతుంది. ఒక్కసారి వాడినా మరణించే అవకాశాలు (ప్రత్యేకించి ఫెంటనిల్) ఉన్నాయని జాతీయ పత్రికలు ఈ విషయంపై వరుస కథనాలు ప్రచురించాయి.

మెదడు రసాయనాల నాశనం : డ్రగ్స్ వల్ల శరీర నాడీ వ్యవస్థలో ఉన్న డోపమైన్, సెరోటోనిన్, నోరెపినెఫ్రైన్ వంటి రసాయనాల సమతుల్యత పూర్తిగా దెబ్బతింటుంది. ఈ ప్రభావం వల్ల అకస్మాత్తుగా కోపం, విచిత్ర ప్రవర్తన, డిప్రెషన్-ఆందోళన, భావోద్వేగ నియంత్రణ కోల్పోవడం, నిర్ణయశక్తి తగ్గిపోవడం వంటి అంశాలని తరచూ పత్రికలు ప్రస్తావిస్తున్నాయి.

హఠాత్తుగా మరణించే ప్రమాదం : సింథటిక్ ఎండిఎంఎ, క్రిస్టల్ మెథ్ (ఐస్), కొకైన్ లాంటి స్టిమ్యులంట్లుహఠాత్తుగా హృదయ స్పందన వేగాన్ని పెంచుతాయి. శరీరం భరించలేని వేడి పుడుతుంది. రక్తపోటు మామూలు స్థాయిలో ఉండదు. ఈ కారణాల వల్ల ఒక్కసారిగా మూర్ఛ రావడం, మరణం సంభవిస్తుంది అని 'ద హిందూ', 'టైమ్స్ నౌ'లో ఎన్నో కథనాలు వచ్చాయి.

పునరుత్పత్తి వ్యవస్థ నష్టం : ఆరోగ్య పత్రికలు ఎక్కువగా ఈ అంశంపై కథనాలు ప్రచురిస్తున్నాయి. పురుషుల్లో స్పెర్మ్ కౌంట్ తీవ్రంగా తగ్గడం, మహిళల్లో హార్మోన్ల అస్థిరత, గర్భధారణ సమస్యలు, జనన లోపాలు వస్తున్నాయి.

డ్రగ్స్ వల్ల పిచ్చి దుశ్చర్యలు : ప్రత్యేకించి ఎల్ఎస్‌డి, మెథ్, హై-థెక్, కానాబీస్, మెఫెడ్రోన్ వాడినప్పుడు ఎక్కడి నుండో శబ్దాలు వస్తున్నట్లు భ్రమిస్తారు. ఎవరో వెంటపడుతున్నట్లు భయపడతారు. ఈ పరిస్థితి ఆత్మహత్యకో, హింసాత్మక ప్రవర్తనకో దారితీస్తుంది. ఈ అంశాలపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' స్పెషల్ రిపోర్ట్స్ పలు కథనాలు ప్రచురించింది.

అవయవాల మొత్తం దెబ్బతినడం : లివర్ ఫైబ్రోసిస్, కిడ్నీ వైఫల్యం, ఊపిరితిత్తుల నష్టం, గుండె పనితీరు దెబ్బతినడం, రక్తనాళాలకి ప్రమాదం వాటిల్లుతుంది. ప్రతి డ్రగ్ ఒక్కో అవయవాన్ని ఒక్కో విధంగా దెబ్బతీస్తుందని అనేక తాజా వైద్య నివేదికలు సూచిస్తున్నాయి.

నాడీ వ్యవస్థపై ప్రభావం

డ్రగ్స్‌కి అలవాటు పడిన వారిలో అధికంగా 'మల్టీపుల్ స్లేరోసిస్' ముప్పు కనిపిస్తుంది. నాడీ వ్యవస్థపై ఈ ప్రభావం నేరుగా ఉంటుంది. ఫలితంగా నాడీ వ్యవస్థని కాపాడే రోగనిరోధక శక్తి క్రమంగా తగ్గిపోతుంది. దీంతో పలు రకాల వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలు ఉంటాయి.

నరాలు దెబ్బతినడం : నరాల ఫైబర్ (నరాల కణంలో దారం పోగులా ఉండే భాగం) చుట్టూ ఉండే ఫాట్‌షీత్‌కి నష్టం కలుగుతుంది. దీనివల్ల కణాలకి విద్యుత్ ప్రేరణ ప్రసార సామర్థ్యం (ఎలక్ట్రికల్ ఇంపలెన్స్) తగ్గి నరాలు దెబ్బతింటాయి.

శరీరంలో ఒక్కో డ్రగ్ ఒక్కో విధంగా ప్రభావం చూపుతుంది. కొన్నింటి వల్ల గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వస్తుంది. ఊపిరితిత్తులపై ప్రభావం చూపడం వల్ల శ్వాససమస్యలు వస్తాయి. కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బతినడం వల్ల శరీరంలోని అన్ని ప్రధాన అవయవాలు దెబ్బతిని ప్రాణాలకు ప్రమాదం ఉంటుంది.

వినియోగం పెరుగుతోంది

యుఎన్ఒడిసి (యునైటెడ్ నేషన్ ఆఫీస్ అండ్ డ్రగ్స్ అండ్ క్రైమ్) నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2023 నాటికి 35 కోట్లకు పైగా వ్యక్తులు డ్రగ్స్ వినియోగదారులుగా పరిగణించారు. వీరిలో 60 లక్షల మందికి పైగా మరణించారు. దేశంలో డ్రగ్స్ వ్యసనానికి ఎక్కువగా యువత గురవుతున్నారు. 3.2 కోట్ల మంది (15-35 ఏళ్ల మధ్య) ఉన్నారు. డ్రగ్స్ వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 6 లక్షల మంది చనిపోతున్నారు. అలాగే డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్న వారిలో ప్రతి 10 మందిలో ముగ్గురు మహిళలు ఉంటున్నారు.

యువతలో ఎక్కువ..

దేశంలో డ్రగ్ వినియోగం 18-30 ఏళ్ల యువతలో ఎక్కువగా ఉంది. గంజాయి, బ్రౌన్ షుగర్, డ్రగ్ మిక్స్ చేసిన ఇంజెక్షన్లు ఎక్కువగా వాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పాఠశాలలు, కాలేజీ స్థాయిల్లోనే గంజాయి వాడకం పెరిగిందని 2024లో నార్కోటిక్స్‌లో పెరిగిన కేసులని బట్టి అంచనా వేయవచ్చు.


పై అంశాలని బట్టి, డ్రగ్స్ వాడకం కేవలం ఆరోగ్య సమస్యగా కాదు.. మానసిక, సామాజిక, ఆర్థిక సంక్షోభానికి ప్రతిరూపంగా చూడాలి. అవగాహన, అప్రమత్తత చర్యలు వేగవంతమే దీని నివారణకి పరిష్కారం.

12న లేకపోతే క్రిస్మస్ తర్వాతే 'అఖండ 2: తాండవం'..!




బాలకృష్ణ-సంయుక్త మీనన్ జంటగా నటించిన సినిమా 'అఖండ 2 : తాండవం' విడుదలపై నెలకొన్న సందిగ్ధత కొనసాగుతోంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ సినిమాను నిర్మించారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పించారు. ఈనెల 5న థియేటర్లలో ఈ సినిమా విడుదల కావాల్సివుంది. నాల్గోతేదీన మరో గంటలో ప్రీమియర్స్ విడుదలకానున్న సందర్భంగా సినిమా విడుదలను ఆపేస్తున్నట్లుగా చిత్ర నిర్మాణ సంస్థ ఓ లెటర్ విడుదల చేసింది. గతంలో 14 రీల్స్ మూవీస్, ఈరోస్ మూవీ సంస్థలు సంయుక్తంగా ఆగడు, నేనొక్కడినే సినిమాలు తీయగా ఫ్లాప్ అయ్యాయి. అప్పట్లో నిర్మాణంలో ఈరోస్ సంస్థ తరపున కిశోర్ లల్లా, సురేష్ లల్లాలు కూడా భాగస్వామ్యమయ్యారు. అప్పట్లో వ్యాపారం తాలూకా బకాయిలు రామ్ ఆచంట, గోపి ఆచంట పడ్డారు. ఈ వివాదం కొనసాగుతుండగానే 14 రీల్స్ సంస్థ అదే బ్యానర్‌కు 14 రీల్స్ ప్లస్ పేరుతో మరో బ్యానర్‌తో అఖండ 2 సినిమాను ఆచంట బ్రదర్స్ నిర్మించి విడుదలకు సిద్ధం చేశారు. ఇంతకుముందే కిశోర్ లల్లా సోదరులు తమ బకాయిలకు 14 శాతం వడ్డీతో కలిపి చెల్లించిన తర్వాతే సినిమా విడుదలను ఆపేయాలని మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు థియేటర్, ఓటీటీ ఇలా ఏ ప్లాట్ ఫాంలోనూ సినిమా విడుదల కాకుండా ఆపేయాలని నిర్మాతలను ఆదేశిస్తూ స్టే ఇచ్చింది. ఈ వివాదం 14 సంవత్సరాల నుంచి కొనసాగుతున్నదే. 2019లో రూ.11.23 కోట్లు బకాయిలు ఉండగా, ఇప్పుడు అది రూ.28 కోట్లుకు చేరింది. పూర్తి బకాయిలు చెల్లిస్తేనే ఇప్పుడు సినిమా విడుదల అవుతుంది. సినిమా నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు వ్యయమైనట్లుగా చెబుతున్న నిర్మాణ సంస్థ విడుదల నేపథ్యంలో సుమారు రూ.145 కోట్లు వరకూ వ్యాపారం చేసింది. అడ్వాన్స్‌బుకింగ్‌లు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు కలిపి సుమారు రూ.115 కోట్లు అగ్రిమెంట్లు చేసుకున్నట్లుగా సమాచారం. సుమారు రూ.500 కోట్లు రాబట్టే లక్ష్యంతో చిత్ర యూనిట్ ప్రణాళిక రూపొందించింది. బాలకృష్ణ సినిమా నేపథ్యంలో ఈనెల ఐదోతేదీన విడుదల కావాల్సిన సినిమాలను కొందరు దర్శకులు, నిర్మాతలు 12కు వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు బకాయిల చెల్లింపు వ్యవహారం పూర్తయితే 12న విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. లేనిపక్షంలో క్రిస్మస్‌కు మరికొన్ని సినిమాలు ఉండటంతో అఖండ 2కు థియేటర్లు అందుబాటులో ఉండని పరిస్థితి. ఇప్పటికే విడుదలకు ఆలస్యంపై డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు ఆందోళన చెందుతున్నారు. థియేటర్లు అందుబాటులో లేకపోతే తాము నష్టపోతామని వారితోపాటుగా థియేటర్ల యజమానులు భయపడుతున్నారు. పూర్తిగా చెల్లించేయటం, అప్పీల్‌కు వెళ్లటం, మధ్యవర్తుల ద్వారా సమస్య పరిష్కరించుకోవటం అనే మూడు మార్గాలు నిర్మాతలకు ఉన్నాయి. వాటిలో నిర్మాణ సంస్థ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

నేడు 'ఉస్తాద్ భగత్‌సింగ్' సాంగ్ ప్రోమో విడుదల



పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్‌లతో సాంగ్ ప్రోమోను రిలీజ్ చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం దేవిశ్రీప్రసాద్ అందిస్తున్నారు.



12న ఈషా విడుదల

త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో నటించిన హర్రర్ థిల్లర్ ఈషా. ఈ మూవీకి శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని హెవీఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో పోతుల హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఇప్పటికే షఉటింగ్ పూర్తయిన ఈ సినిమా ఈనెల 12న థియేటర్లలో విడుదల కానుంది. బన్నీ వాసు, వంశీ నందిపాటి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ సీన్లు భయపెట్టేలా ఉన్నాయి. పృథ్వీరాజ్ కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రంలో అఖిల్‌రాజ్, సిరి హన్మంత్ ప్రధాన పాత్రలు పోషించారు.

ఓపెనర్లుగా గిల్, అభిషేక్

- హార్దిక్ పాండ్యా పునరాగమనం
- నేడు దక్షిణాఫ్రికాతో తొలి 20
- రాత్రి 7.00గం॥లకు



కటక్: భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఐదు టి20ల సిరీస్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. భారత పర్యటనకు వచ్చిన సఫారీ జట్టు టెస్ట్ సిరీస్‌ను చేజిక్కించుకోగా.. భారతజట్టు వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య జరిగే టి20 సిరీస్‌లో ఏ జట్టు పైచేయి సాధిస్తుందో..! ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా కటక్ వేదికగా తొలి టి20 సమరం జరగనుంది. టెస్ట్ సిరీస్ మధ్యలో గాయం కారణంగా వైదొలిగిన శుభ్‌మన్ గిల్ ఫిట్‌నెస్ సాధించాడు. దీంతో అతడు టి20ల్లో బరిలోకి దిగనున్నాడు. ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నట్లు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. వికెట్ కీపర్‌గా సంజు శాంసన్, టి20 స్పెషలిస్ట్ బ్యాటర్లు దూబే, రింకు సింగ్‌లకు చోటు ఖాయం. మిస్టరీ స్పిన్నర్ వరణ్ చక్రవర్తికి తోడు కుల్దీప్ రాణిస్తే సఫారీలను చిత్తు చేయడం ఖాయం. పేసర్ జస్ప్రీత్ బుమ్రాకి తోడు హార్దిక్ పాండ్యా కూడా జట్టుకు అందుబాటులోకి రావడంతో టీమిండియా మరింత పటిష్ఠంగా తయారైంది. ఈ క్రమంలో ఇరు జట్ల మధ్య జరిగే తొలి టి20 హోరాహోరీగా సాగడం ఖాయం. యువ క్రికెటర్ అభిషేక్ శర్మకి తోడు సూర్యకుమార్ యాదవ్, తిలక్‌వర్మ, సంజు శాంసన్, శుభ్‌మన్ గిల్ ప్రధాన బ్యాటర్లుగా.. హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్ల కోటాలో చోటు దక్కించుకోవడం ఖాయం. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్, వరుణ్ చక్రవర్తిలతో భారత జట్టు పటిష్ఠంగా ఉంది.

భారత్‌దే పైచేయి!

టీమిండియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఇప్పటివరకు 31 టి20 మ్యాచులు జరగ్గా.. ఇందులో 18 మ్యాచుల్లో భారత జట్టు, 12 మ్యాచుల్లో సఫారీల జట్టు గెలిచింది. 1 మ్యాచ్‌లో మాత్రం ఫలితం తేలలేదు.

జట్లు...

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్(వైస్ కెప్టెన్), అభిషేక్, తిలక్, హార్దిక్, దూబే, అక్షర్, జితేశ్, సంజు(వికెట్ కీపర్లు), బుమ్రా, వరుణ్, అర్ష్‌దీప్, కుల్దీప్, హర్షిత్, సుందర్.

దక్షిణాఫ్రికా: మార్క్రమ్(కెప్టెన్), డికాక్(వికెట్ కీపర్), జోర్జి, బ్రెవీస్, స్టబ్స్, డేవిడ్ మిల్లర్, యాన్సెన్, బోచ్, మహరాజ్, నోర్జె, ఎన్గిడి, హెండ్రిక్స్, బార్ట్‌మన్. ఫెర్రెరియా, మాకా, లింగ్డే.

షెడ్యూల్...

9(మంగళ) : తొలి టి20 (కటక్)
11(గురు) : రెండో టి20(ముల్లాన్‌పూర్)
14(ఆది) : మూడో టి20(ధర్మశాల)
17(బుధ) : నాలుగో టి20(లక్నో)
19(శుక్ర) : ఐదో టి20(అహ్మదాబాద్)

ఐసిసికి జియో హాట్‌స్టార్ ఝలక్

రెండేళ్ల ముందే ఒప్పందం రద్దు చేసుకుంటూ ప్రకటన

ఐసిసి టి20 ప్రపంచ కప్‌నకు ముందు జియో హాట్‌స్టార్ సంచలన నిర్ణయం తీసుకుంది. మరో రెండేళ్లపాటు ఒటిటి స్పాన్సర్ షిప్ ఉన్నా.. ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది. 2024-27 మధ్య కాలానికి 3 బిలియన్ల డాలర్లు(భారత కరెన్సీలో రూ.300కోట్లు)తో జియో హాట్‌స్టార్ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం నాలుగేళ్లపాటు భారత మీడియా హక్కుల ఒప్పందం ఉన్నా.. మిగిలిన రెండేళ్ల కాంట్రాక్ట్‌ను కొనసాగించలేమని ప్రకటించింది. జియోహాట్‌స్టార్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ఒటిటి ప్లాట్ ఫామ్‌కు వస్తున్న భారీ ఆర్థిక నష్టాలే కారణమని సమాచారం. మనీ గేమింగ్ ప్రకటనలపై భారత ప్రభుత్వం నిషేధం, తక్కువ ప్రకటనల డిమాండ్, డాలర్‌తో రూపాయి విలువ పతకం అని సమాచారం. దీంతో ఐసిసి 2026-29 మధ్య కాలానికి 2.4 బిలియన్ల డాలర్లతో భారత మీడియా హక్కులకు తాజాగా ప్రకటన జారీ చేసింది. జియోహాట్‌స్టార్ ఒటిటి నుంచి వైదొలగడంతో పలు ప్రధాన ఒటిటి ప్లాట్ ఫామ్‌లకు ఐసిసి ఆహ్వానాలు పంపింది. సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో వంటి సంస్థలను సంప్రదించినట్లు సమాచారం.

నటీనటులకు ఆహ్వానం



శ్రీ రామా సిల్వర్ స్క్రీన్ ప్రొడక్షన్ నం.1 సినిమాల్లో నటించేందుకు నటీ నటులకు ఆహ్వానం పలుకుతోంది. అచ్చ తెలుగు హీరో-హీరోయిన్‌గా నటించేందుకు ఆసక్తికలవారిని కోరుతోంది. అనుభవంతో పనిలేదనీ, అభినయం ఉంటే చాలని పేర్కొంది. హీరో అయితే 24 నుంచి 30, హీరోయిన్ అయితే 18 నుంచి 26 సంవత్సరాల వయస్సు వారు కావాలని కోరింది. పూర్తి వివరాలను సెల్ : 8096196116కు గానీ, సిల్వర్‌స్క్రీన్స్‌పేరుతో జిమెయిల్‌కు పంపించాలని సూచించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68